PRAMOD BHAVANI
Address:- Plot no 1, Bhagyalaxmi Towers
Opp. GHMC SARRORNAGAR CIRCLE OFFICE
SARRORNAGAR HYDERABAD 500035
Gmail : bhavani2011k @ Gmail.com,cell:9966405785

RNI No: TELTEL/2021/81803

# మెట్రో సిటీ టైమ్స్

METRO CITY TIMES Telugu daily

తెలుగు దినపత్రిక

JAI BHAVANI
CITY PLANNERS AND BUILDERS
Address:- Plot no 1, Bhagyalaxmi Towers
Opp. GHMC SARRORNAGAR CIRCLE OFFICE
SARRORNAGAR HYDERABAD 500035
Gmail : bhavani2011k @ Gmail.com,cell:9966405785

సంపుటి: 6 | సంచిక : 22 | రంగారెడ్డి | బుధవారం, సెప్టెంబర్ 30, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# చెడ్డ పేరు వచ్చినా.. మంచి పేరు వచ్చినా వారిదే!




హైదరాబాద్: ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే కేంద్రంగా కలెక్టరేట్లు పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని బుధవారం ప్రారంభించిన ఆయన.. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం కొత్త కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై జిల్లా పరిపాలన, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పేదలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే కార్యాలయంగా కలెక్టరేట్ ఉండాలని సూచించారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు చేరా లంటే ఉద్యోగులే కీలకమని పేర్కొన్నారు. సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను తమ కుటుంబ సభ్యుల మాదిరిగా భావించి స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, అందరి సహకారంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

**3 శాతం ఉద్యోగులు.. 97 శాతం ప్రజలు**

రాష్ట్రంలో సుమారు 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల సంఖ్య పరంగా చూస్తే తక్కువ శాతం మంది సిబ్బంది పెద్ద సంఖ్యలో ప్రజలకు సేవ చేయాల్సి రావడం బాధ్యతతో కూడుకున్న వ్యవహారమని అన్నారు. ప్రభుత్వం గురించి ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడినా, ప్రతికూల అభిప్రాయం వచ్చినా అందులో ఉద్యోగుల పనితీరు ప్రభావం ఉంటుందని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలకు ఎన్ని చట్టాలు చేసినా, ఎంత నిధులు కేటాయించినా వాటి ప్రయోజనం క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉద్యోగులదేనని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ప్రజా సమస్యల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ పనితీరుపైనే విమర్శలు వస్తాయని పేర్కొంటూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.







**కేంద్రంతో సహకారం ఉండాలి**

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ. 840 కోట్ల కేంద్ర నిధులు సాధించుకున్నామని సీఎం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరిస్తే ముఖ్యమంత్రిగా తాను అభినందించేందుకు ఎలాంటి సంకోచం లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయంగా తాము ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ.. మిగతా సమయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవస రం ఉందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్ర--రాష్ట్ర సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు.. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు పనిచేయాలని సీఎం సూచించారు.

# జెన్ జీకి తగ్గట్టు 'వైబ్' ఆరోగ్య బీమా

## రోజువారీ ఆరోగ్యం.. మానసిక శ్రేయస్సు.. రక్షణ ఒకే ప్యాకేజీలో

## ఐసీఐసీఐ లొంబార్డ్ కొత్త ఆరోగ్య రక్షణ పరిష్కారం




**ముంబయి :** యువతరంలో మారుతున్న ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ఐసీఐసీఐ లొంబార్డ్ 'వైబ్ (విఐబిఇ)' పేరుతో కొత్త ఆరోగ్య రక్షణ పరిష్కారాన్ని పరిచయం చేసింది. ఆసుపత్రిలో చేరినప్పుడు లభించే బీమా కవరేజీతో పాటు రోజువారీ ఆరోగ్య సంరక్షణ, మానసిక శ్రేయస్సు, డిజిటల్ సేవలు, జీవనశైలికి అనుసంధానమైన ప్రయోజనాలను ఇందులో అందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. యువత అభిరుచులకు అనుగుణంగా..

డిజిటల్ సౌకర్యాలకు అలవాటుపడిన యువత ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మానసిక శ్రేయస్సుకూ ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఆరోగ్య బీమా విధానానికి భిన్నంగా రోజువారీ జీవితంలోనూ ఉపయోగపడేలా 'వైబ్'ను రూపొందించినట్లు ఐసీఐసీఐ లొంబార్డ్ తెలిపింది. 'ఐఎల్ టేక్ కేర్' వ్యవస్థ ఆధారంగా మొబైల్-ఫస్ట్ విధానంలో సేవలు అందించనున్నట్లు పేర్కొంది. సంస్థ నిర్వహించిన పరిశోధనలో 70.5 శాతం మంది ఆరోగ్యం, శ్రేయస్సును తమ ప్రధాన రక్షణ ప్రాధాన్యంగా పేర్కొనగా.. 54.5 శాతం మంది ఆరోగ్యంపై మరింత లోతుగా తెలుసుకోవడానికి ఆసక్తి చూపారు. ప్రత్యేకంగా ఓపీడీ కవరేజీ ఉంటే బీమా కొనుగోలు చేసే ఆసక్తి పెరుగుతుందని 40.4 శాతం మంది తెలిపారు. కోర్ ప్రొటెక్ట్: ఆసుపత్రిలో చేరినప్పుడు అయ్యే ఖర్చులకు కవరేజీతో పాటు సమ్ ఇన్సూర్డ్‌ను అపరిమితంగా రీసెట్ చేసుకునే సదుపాయం. పాలసీ నిబంధనల మేరకు సమ్ ఇన్సూర్డ్‌పై 100 శాతం వరకు లాయల్టీ ప్రయోజనాలు అందనున్నాయి.

ఆరా పాయింట్స్: ఓపీడీ కన్సల్టేషన్లు, వైద్య పరీక్షలు, మందులు, దంత, కంటి సంరక్షణ వంటి రోజువారీ ఆరోగ్య అవసరాలకు నెలవారీ హెల్త్‌కేర్ క్రెడిట్లను వినియోగించుకునే అవకాశం. మైండ్ అండ్ మూడ్ రికవర్: మానసిక ఆరోగ్యానికి సంబంధించిన నిపుణుల కౌన్సెలింగ్ సేవలు.

ప్లాన్ ఆధారంగా 3 నుంచి 10 వరకు కౌన్సెలింగ్ సెషన్లకు అవకాశం ఉంటుంది.

రిఫరల్ డిస్కౌంట్: విజయవంతమైన ప్రతి రిఫరల్‌కు 500 క్రెడిట్ పాయింట్లు పొందే అవకాశం. గెట్‌ఫిట్: జిమ్, క్రీడలు, పైలేట్స్ తదితర అర్హత కలిగిన జీవనశైలి కార్యకలాపాలకు వెల్‌నెస్ క్రెడిట్లను వినియోగించుకోవచ్చు.

గ్రీన్ ఫ్లాగ్ బోనస్: ఎంచుకున్న ప్లాన్‌ను బట్టి ప్రతి పాలసీ సంవత్సరానికి సమ్ ఇన్సూర్డ్‌పై అదనపు బోనస్ లభిస్తుంది. ఇది సంబంధిత ప్లాన్‌కు నిర్దేశించిన గరిష్ఠ పరిమితికి లోబడి ఉంటుంది.

ఐసీఐసీఐ లొంబార్డ్ చీఫ్--హెల్త్ అండర్‌రైటింగ్, క్లెయిమ్స్, కస్టమర్ సర్వీస్, ఆపరేషన్స్ గిరీష్ సెహగల్ మాట్లాడుతూ.. యువత అనారోగ్యం వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ముందుగానే ఆరోగ్యంపై దృష్టి పెడుతోందన్నారు. తమ ఎంపికలపై నియంత్రణ, కవరేజీలో స్పష్టత, ఆసుపత్రి చికిత్సకు మించి రోజువారీ ప్రయోజనాలను యువ వినియోగదారులు కోరుకుంటు న్నారని తెలిపారు. ఈ అంచనాలకు అనుగుణంగా ఆరోగ్య రక్షణను వారి రోజువారీ జీవితాలకు చేరువ చేయడమే 'వైబ్' ఉద్దేశమని పేర్కొన్నారు. 25 ఏళ్లుగా ఆరోగ్య రక్షణ రంగంలో ఉన్న ఐసీఐసీఐ లొంబార్డ్.. సాంకేతికత, ఆవిష్కరణ, కస్టమర్-కేంద్రిత ఉత్పత్తి రూపకల్పనకు అనుగుణంగా 'వైబ్'ను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ తెలిపింది.

# మైక్యూర్ యాప్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

## ప్రగతినగర్‌లో యథేచ్ఛగా అక్రమ ఫ్లెక్సీలు

**-- సంబంధం లేని ఫొటోలతో ఉన్నతాధికారులకే సిబ్బంది బురిడీ!**

**-- ఫ్లెక్సీలు తొలగించకుండానే సమస్య పరిష్కారమైనట్లు నివేదికలు**

**-- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ డీసీ, జోనల్ కమిషనర్, కమిషనర్‌కు స్థానికుల వినతి**




నిజాంపేట్, సెప్టెంబర్ 30 (మెట్రో సిటీ టైమ్స్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ/సీఎంసీ ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక మున్సిపల్ మైక్యూర్ (వీఎజ్ఖ=) యాప్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది తప్పుడు సమాచారంతో ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజాంపేట్ సర్కిల్ ప్రగతినగర్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, అంతర్గత రహదారుల్లో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వెలిసిన అక్రమ ఫ్లెక్సీలపై స్థానికులు యాప్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదులు చేశారు. అయితే సంబంధిత సిబ్బంది మాత్రం క్షేత్రస్థాయిలో ఫ్లెక్సీలను తొలగించకుండానే, సమస్య పరిష్కారమైనట్లు సంబంధం లేని ఇతర ఫొటోలను అప్‌లోడ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు.

?ఈ బాధ్యతారాహిత్య వైఖరిని స్థానిక వార్డ్ ఆఫీసర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన కరువైందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వంతో కాలనీలలో అక్రమ ఫ్లెక్సీల బెడద మరింత ఎక్కువవుతోందని, ప్రజాధనంతో నడిచే వ్యవస్థను సిబ్బంది నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వార్డ్ ఆఫీసర్, సంబంధిత సిబ్బందిపై నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, సీఎంసీ కమిషనర్ జి.సృజన వెంటనే సమగ్ర విచారణ జరిపి కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రగతినగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. మైక్యూర్ యాప్ ద్వారా క్లోజ్ చేస్తున్న ఫిర్యాదుల వాస్తవికతపై ప్రత్యేక తనిఖీ బృందాలతో ఆడిట్ చేపట్టాలని కోరుతున్నారు.

?180 అక్షరాల సంక్షిప్త వెర్షన్ (180 జష్ట్రుతీ-ఖ్వీవతీం ఎవతీంఅశీఅ)

?మైక్యూర్ యాప్‌లో తప్పుడు నివేదికలు: ఫ్లెక్సీల తొలగింపుపై సిబ్బంది చేతులెత్తేత

?ప్రగతినగర్‌లో అక్రమ ఫ్లెక్సీలపై మైక్యూర్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే ఫేక్ ఫొటోలు పెట్టి సిబ్బంది తప్పించుకుంటున్నారు. వార్డ్ ఆఫీసర్ పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. నిజాంపేట్ డీసీ సాబీర్ అలీ, జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, కమిషనర్ సృజన తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రోడ్డు పనులు పూర్తి... కాలువల పనులు అసంపూర్తి

మెట్రో సిటీ టైమ్స్ న్యూస్ సెప్టెంబర్ 30 రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి లో ఇటీవల అరుముళ్ళ పోషం చౌరస్తా నుండి మసీదు వరకు నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఇంత వరకు బాగానే ఉన్న రోడ్డు పక్కన ఉన్న కాలువల పరిస్థితి మాత్రం దారుణంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో కాలువలను అవసరానికి అనుగుణంగా తొలగించి, పనులు పూర్తయిన తర్వాత వాటిని పునరుద్ధరించకుండా కాంట్రాక్టర్లు అసంపూర్తిగా వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కాలువల్లో నీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పాటు, రోడ్డు పక్కన గుంతలు, మట్టి పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం మీదుగా వెళ్లినప్పుడు అదుపు తప్పి కింద పడిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా కాలువల పనులను మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మెట్రో సిటీటైమ్స్

గురువారం, అక్టోబర్ 1, 2026

# తెరపైకి సూట్ కేసు పార్టీలు

ఇప్పటి వరకు సూట్ కేసు కంపెనీలనే చూశాము... ఇప్పుడు సూట్ కేసు పార్టీలు కూడా వచ్చేవాయి..కాగితాలకే పరిమితమైన కొన్ని పార్టీలకు విరాళాల రూపంలో వందల కోట్ల నిధులు అందుతున్న విషయం మూడు వారాల కిందట వెలుగులోకి వచ్చింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో సీఐడీ క్రైమ్ పోలీసులు తాజాగా ఇటువంటి పార్టీలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గుజరాత్‌లోని ఆరు చిన్న పార్టీలు 2023-24లో 1700 కోట్ల రూపాయల విరాళాలు అందుకున్నట్టు పరిశోధనలో తేలింది. ఈ మొత్తం బీజేపీ మినహా అన్ని జాతీయ పార్టీల మొత్తం ఆదాయానికి కంటే ఎక్కువ.భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని 173 సెక్షన్ ప్రకారం ఈ రాజకీయ పార్టీలపై కేసులు నమోదు చేశారు.ఆదాయపు పన్ను శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఆరు పార్టీల్లో కనీసం మూడింటిపై పోలీసు కేసులు నమోదు అయ్యాయి.భారతీయ నేషనల్ జనతా దళ్, గరీబ్ కల్యాణ్ పార్టీ, స్వతంత్ర అభివ్యక్తి పార్టీలపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. స్థానిక గుజరాతీ వార్తా పత్రికల ప్రకారం సత్యవాది రక్షక్ పార్టీ అనే నాల్గో పార్టీపై కూడా ఎఫ్ఐఆర్ రిజిస్టర్ అయ్యింది. అయితే దీనికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ వద్ద లేకపోవడంతో నిర్ధరించలేకపోతోంది.'ఈ కేసులో రెండు పార్టీలు అహ్మదాబాద్‌కు చెందినవికాగా, మరొకటి గాంధీనగర్‌కు చెందింది' అని గాంధీనగర్ సీఐడీ క్రైమ్ విభాగం అధికారి ఒకరు చెప్పారు.ఈ కేసులో అరెస్టులు ఏమైనా జరిగాయా అని అడగగా, ' ఇప్పటి వరకు ఒక్కర్ని కూడా అరెస్టు చేయలేదు, దర్యాప్తు కొనసాగుతోంది' అని చెప్పారు. గాంధీనగర్ కేంద్రంగా నడుస్తున్న భారతీయ నేషనల్ జనతా దళ్, దానితో సంబంధం ఉన్న నలుగురిపై సీఐడీ క్రైమ్ విభాగం కేసు నమోదు చేసింది.ఈ పార్టీ 2019-20 నుంచి 2024-26 వరకు 1,143 కోట్ల నిధులు అక్రమ పద్ధతిలో స్వీకరించిందని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు 343 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లినట్టు అభియోగాలు మోపారు."నిందితులంతా కుమ్మక్కై నకిలీ పత్రాలు సృష్టించి వాటినే అసలైన పత్రాలుగా పేర్కొంటూ తప్పుడు విరాళాల నివేదికలను(ఫారం 24ఏ) ఎన్నికల సంఘానికి సమర్పించారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు 343 కోట్లరూపాయల నష్టం వాటిల్లిందని" ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వెల్లడించారు."ఈ కేసులో నిందితులు కుట్రపూరితంగా బోగస్ విరాళాలు చూపించి మోసానికి పాల్పడ్డారని ప్రాథమిక విచారణలో తేలింది. పన్నులు ఎగవేసే లక్ష్యంతో కమిషన్ ఏజెంట్ల ద్వారా నిధులు సేకరించి ఆర్టీజీఎస్ బ్యాంకింగ్ ఛానల్ ద్వారా ఐదు బ్యాంకు ఖాతాలకు నిధులను బదిలీ చేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది""విరాళ దాతలకు నకిలీ డొనేషన్ స్లిప్స్, డబ్బులు డిపాజిట్ చేసినట్టు నకిలీ రసీదులు నిందితులు అందజేసేవారు. దీంతో ఆ దాతలకు ఆదాయపు పన్ను చట్టంలోని 80జీజీబీ, 80జీజీసీ కింద తప్పుడు మార్గంలో వంద శాతం పన్ను మినహాయింపును పొందే అవకాశం లభించేది" అని పోలీసులు తెలిపారు.బీఎన్‌జేడీ జాతీయ అధ్యక్షుడు గజేరాతో పరిశోధనలో భాగంగా మాట్లాడినప్పుడు తాము ఏ తప్పు చేయడం లేదని చెప్పారు.'పార్టీ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవడానికి లేదు. డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎటు వెళ్తున్నాయో ఆదాయపు పన్ను శాఖకు తెలుస్తుంది' అని పేర్కొన్నారు. స్వతంత్ర అభివ్యక్తి పార్టీ 2023-2025 మధ్య 519 కోట్ల రూపాయల మోసానికి పాల్పడినట్టు పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ పత్రాలు సృష్టించి, అవే అసలైనవిగా భారత ఎన్నికల సంఘానికి నివేదికలను సమర్పించారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు 150 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఆ పార్టీకి వచ్చిన మొత్తం నిధుల్లో ఇది 30 శాతానికి సమానం. దీంతో ఆ పార్టీపై, ఆపార్టీతో కలిసి పని చేస్తున్న వారిపై ఆర్థిక మోసం, విశ్వాస ఘాతుకానికి పాల్పడిన ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అహ్మదాబాద్‌లోని నరోదా ప్రాంతంలో మహవీర్ నగర్ కల్యాణ్ మిల్‌కు ఎదురుగా ఉన్న షాప్ నెంబర్ 2లో స్వతంత్ర అభివ్యక్తి పార్టీ కార్యాలయం ఉంది.స్వతంత్ర అభివ్యక్తి పార్టీకి చెందిన పన్ను సలహాదారుడు మెహుల్ కుమార్ మహేష్ కుమార్ ఖాత్రీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర పర్షోత్తం తివారీ, చార్టర్డ్ అకౌంటెంట్ మయూర్ సింగ్ రాథోడ్‌తోపాటు ఇతర కార్యనిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.విరాళాలు తిరిగి ఇచ్చినట్టు చెప్పుకుంటున్న మెహుల్‌కుమార్ మహేష్‌కుమార్ ఖాత్రి మొబైల్ ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లో విరాళాలు ఇచ్చిన రాజకీయ నాయకుల పేర్లు లభించినట్టు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. ఈ జాబితాలో స్వతంత్ర అభివ్యక్తి పార్టీకి లభించిన నకిలీ విరాళాల వివరాలు ఉన్నాయి.ప్రాథమిక దర్యాప్తులో నిందితుల నుంచి తీసుకున్న వాంగ్మూలాల ద్వారా అతిపెద్ద, వ్యవస్థాగత రాజకీయ విరాళాల కుంభకోణం బయటపడింది" అని ఎఫ్ఐఆర్‌లో తెలిపారు.ఈ స్వతంత్ర అభివ్యక్తి పార్టీ దేశంలోని వివిధ పన్ను చెల్లింపులదారుల నుంచి చెక్కు లేదా బ్యాంకింగ్ బదిలీ ద్వారా రాజకీయ విరాళాలను స్వీకరించింది. ఈ విరాళాల ఆధారంగా సెక్షన్ 80 జీజీబీ ప్రకారం చాలా మంది పన్ను చెల్లింపుదారులు తప్పుడు మార్గంలో పన్ను మినహాయింపు పొందారు. 8 నుంచి 9 శాతం కమిషన్‌గా తీసుకున్న తర్వాత మిగతా సొమ్మును క్యాష్ రూపంలో విరాళం ఇచ్చిన వారికి అందజేస్తారు." అని పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు లేవని, కేవలం కమిషన్ల కోసం, తప్పుడు లెక్కల కోసమే పార్టీ ఏర్పాటు చేసినట్టు స్వతంత్ర అభివ్యక్తి పార్టీ అధ్యక్షుడు సురేంద్ర తివారీ వాంగ్మూలం ఇచ్చినట్టు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు.సురేంద్ర తివారీ నేతృత్వంలోని పార్టీ 2023-24లో 219 కోట్ల రూపాయలను విరాళాల రూపంలో స్వీకరించారు. పార్టీకి వచ్చిన విరాళాల గురించి తనకు తెలియదని, సీఏ, మయూర్ సింగ్ తనను తప్పుదారి పట్టించారని సురేంద్ర తివారీ చెప్పారు.ఈ ఆరోపణలను మయూర్ సింగ్ ఖండించారు. తాను ఏ పార్టీనీ నడపడం లేదని, వివిధ పార్టీలకు ఎన్నికల సంఘం వద్ద ట్యాక్స్ ఫైలింగ్ మాత్రమే చేస్తున్నట్టు చెప్పారు. అందులో న్యూ ఇండియన్ యూనైటెడ్ పార్టీ కూడా ఉందని పేర్కొన్నారు.'అంతా ఒకేరకమైన మనుషులే, మీకు అర్థమవుతోంది కదా, ఇక్కడ పార్టీలు ఇళ్లలోనే నడుస్తాయి'అని ఆయన అన్నారు.స్వతంత్ర అభివ్యక్తి పార్టీసహా సురేంద్ర తివారీ, మయూర్ సింగ్, మెహుల్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది.గరీబ్ కల్యాణ్ పార్టీ, అందులో పని చేస్తున్న 8 మందిపై సీఐడీ క్రైమ్ విభాగం కేసు పెట్టింది. ఈ పార్టీ అహ్మదాబాద్‌లోని నానా చిలోదా ప్రాంతం ఉన్న శ్రీనాథ్ షాపింగ్ సెంటర్ ఏ-203లో నడుస్తోంది.ఈ పార్టీ 2022- 2026 మధ్య 206 కోట్ల రూపాయల కంటే ఎక్కువ నిధులు స్వీకరించి అక్రమాలకు పాల్పడినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.దీని వల్ల కూడా ప్రభుత్వ ఖజానాకు 62 కోట్ల రూపాయల కంటే ఎక్కువ నష్టం వాటిల్లింది. ఇది ఆ పార్టీ స్వీకరించిన మొత్తం నిధుల్లో 30 శాతం. దీంతో ఆ పార్టీ, ఆ పార్టీలో పని చేస్తున్న వారిపై ఆర్థిక మోసానికి పాల్పడారనే కేసు నమోదు అయ్యింది.గరీబ్ కల్యాణ్ పార్టీ అక్రమ విరాళాలు స్వీకరించించినట్టు సేకరించిన గణాంక సమాచారం ఆధారంగా ఆదాయపు పన్ను శాఖ ఆ పార్టీ కార్యాలయంలో తనిఖీలు చేసింది. దీని ఆధారంగా లభించిన ఆధారాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు."ప్రాథమిక దర్యాప్తు, నిందితులు వాంగ్మూలాల ఆధారంగా ఇది భారీ, వ్యవస్థీకృతమైన నకిలీ విరాళాల కుంభకోణమని చెప్పవచ్చు. ఈ కుంభకోణంలో భాగంగా దేశంలోనే అధిక పన్ను చెల్లింపులదారుల నుంచి చెక్స్, బ్యాంక్ ఛానల్స్ ద్వారా రాజకీయ విరాళాలు స్వీకరించారు.ఈ విరాళాల ఆధారంగా పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 80జీజీబీ ప్రకారం అక్రమమార్గంలో పన్ను మినహాయింపులు పొందారు.ఆ తర్వాత, ఆ నిధులు దశలవారీగా రెండు నకిలీ కంపెనీలకు (మెస్సర్స్ కృష్ణ ఎంటర్‌ప్రైజెస్, మెస్సర్స్ జలరామ్ ఎంటర్‌ప్రైజెస్) బదిలీ అయ్యాయి. చివరిగా ఆ నిధుల నుంచి 5 నుంచి 7 కమిషన్ మినహాయించుకున్నారు. మిగతా సొమ్మును దాతలకు క్యాష్ రూపంలో ఇచ్చేశారు" అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.క్షేత్ర స్థాయిలో ఎలాంటి కార్యకలాపాలు లేకపోయినా కేవలం నకిలీ ఎంట్రీలు, కమిషన్ల కోసమే పార్టీ ఏర్పాటు చేసినట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నీరజ్ క్షత్రియ, కోశాధికారి ధీరజ్ క్షత్రియ అంగీకరించారని ఎఫ్ఐఆర్‌లో తెలిపారు."దేశవ్యాప్తంగా వివిధ పన్ను చెల్లింపుదారుల నుంచి చెక్స్ లేదా ఆర్టీజీఎస్ ద్వారా విరాళాలు వచ్చాయి. దీని కోసం వారికి నకిలీ రసీదులు ఇచ్చారు. వీటి ఆధారంగా పన్ను చెల్లింపుదారులు తప్పుడు మార్గంలో 100 శాతం మినహాయింపును క్లెయిమ్ చేసుకోగలిగారు. ఇది పన్ను ఎగువేతకు వీలు కలిగింది.

# ఖమ్మంలో పోలీసు అధికారుల బదిలీల కలకలం

## నలుగురు సిఐలకు స్థానచలనం - ముగ్గురు ఐజీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు

ఖమ్మం : పోలీసు కమిషనరేట్ పరిధిలో సి ఐ ల బదిలీలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మల్టీ జోన్-1 ఐజీ సంతోష్ చంద్రశేఖర్ రెడ్డి జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం పలువురు సిఐలను బదిలీ చేయగా, ముఖ్యంగా ఖమ్మం నగరంలో కీలక బాధ్యతల్లో పనిచేస్తున్న నలుగురు అధికారులకు స్థానచలనం కలిగింది. ఖమ్మం 2 టౌన్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న బొమ్మెర బాలకృష్ణ, ఖానాపురం హవేలీ ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న రడం భానుప్రకాష్, ఖమ్మం ట్రాఫిక్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న బెల్లం సత్యనారాయణకు అధికారులకు నూతన పోస్టింగ్‌లు కేటాయించకపోవడం పోలీసు వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.బదిలీ అయిన ఈ అధికారులను హైదరాబాద్‌లోని మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. నగరంలోని నలుగురు సిఐల పరిధిలో కీలకమైన స్టేషన్ల బాధ్యతలు చూస్తున్న అధికారులలో ముగ్గురికి ఎలాంటి నూతన స్థానాలు కేటాయించకుండా నేరుగా ఐజీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయమనడం వెనుక కారణాలపై పోలీసు శాఖలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. రాజకీయ, పరిపాలనా కారణాలా లేక అంతర్గత వ్యవహారాల వల్ల పోస్టింగ్ ఇవ్వలేదా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.మరోవైపు నగరంలోని వివిధ స్టేషన్లకు కొత్త సిఐలను నియమించారు. సీసీఎస్‌బీలో పనిచేస్తున్న జ్ఞానదృష్టి రామకృష్ణను ఖమ్మం ఎఎ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా, ఇంటెలిజెన్స్ విభాగం నుంచి వచ్చిన ఎండి. సాధిక్ పాషాను ఖమ్మం ఎ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. అలాగే ఖమ్మం ఎ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న తాటిపాముల కరుణాకర్‌ను విఆర్ కు పంపి, రఘునాథపాలెం పిఎస్ అటాచ్‌మెంట్ ఇచ్చారు. ఉమెన్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న నల్లమోతు చిట్టిబాబును ఖమ్మం ఎఎ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేయగా ఖమ్మం ఎఎ టౌన్ ఎస్‌హెచ్ఓ జిల్లేళ్లమూడి మోహన్‌బాబును కూడా ఐజీ ఆఫీస్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. అలాగే సిటిసిలో ఉన్న కాగిటోజు శివప్రసాద్‌ను ట్రాఫిక్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ఒకేసారి ఈ స్థాయిలో బదిలీలు జరగడం, అందులోనూ కీలక సీఐల్లో ముగ్గురికి స్థానచలనం కలిగి పోస్టింగ్ ఇవ్వకపోవడం ఖమ్మం నగర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# మిషన్ కర్మయోగి వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

విజయవాడ : విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్షాప్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు. ఈ వర్క్షాప్కు ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటి బిల్డింగ్లో అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీ మొదటి స్థానంలో నిలిచిన నేపథ్యంలో రాష్ట్ర అధికారులు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్ డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వరరావుకు అవార్డును అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో ఒడి విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్షాప్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పాల్గొని ప్రసంగించారు. ఈ వర్క్షాప్కు ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటి బిల్డింగ్లో అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీ మొదటి స్థానంలో నిలిచిన నేపథ్యంలో రాష్ట్ర అధికారులు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్ డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వరరావుకు అవార్డును అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం చంద్రబాబు అవార్డులు అందించారు.శా రాష్ట్రాలకు కూడా సీఎం చంద్రబాబు అవార్డులు అందించారు. చంద్రబాబు మాట్లాడుతూ రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎప్పటికప్పుడు పాలనా వ్యవహారాలను, పౌరసేవల నాణ్యతను పర్యవేక్షిస్తున్నాం. డేటా లేక్ లాంటి వ్యవస్థలు, ఇ- ఫైళ్ల విధానం ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. పెర్ఫార్మెన్సు ఇండి కేటర్లను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో సూచనలు జారీ చేస్తున్నామని అన్నారు. ఐ గాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా 2 కోట్ల కోర్సులను పూర్తి చేసి ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టిన యంత్రాంగాన్ని అభినందిస్తున్నాను. ఉద్యోగులు, ప్రభుత్వ యంత్రాంగం లేకుండా ఏ ప్రకృతి విపత్తును ఎదుర్కోలేం, పండుగలైనా, కార్యక్రమాలైనా ఉద్యోగులే కీలకం. కుటుంబాలను సైతం పక్కన పెట్టి ఉద్యోగులు ప్రజా సేవలో నిమగ్నం అవుతున్నారు. వారిని ఎప్పుడూ విస్మరించలేం..అందుకే వారి సామర్థ్యాలను పెంచేలా, నైపుణ్యాలు అందిపుచ్చుకునేలా ఈ శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నాం. నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా ఐగాట్ -మిషన్ కర్మయోగి ప్రయత్నం చేస్తోంది. రీల్స్ కంటే కెపాసిటి బిల్డింగ్ కోసం సమయం వెచ్చిస్తే మన వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రజలకు అందించే సేవల నాణ్యత పెరగాలంటే టెక్నాలజీని, విధానాలను అనుసంధానిస్తూ ముందుకు వెళ్లాలి. ప్రభుత్వ శాఖల మధ్య నిరంతరాయంగా సమాచార పంపిణీ జరగాలి అప్పుడే వేగంగా నిర్ణయాలు తీసుకోగలం. యువత ఆకాంక్షలకు అనుగుణంగా మనం నిర్ణయాలు తీసుకున్నప్పుడే దేశం అగ్రస్థానానికి చేరుతుందని అన్నారు. సంక్షోభంగా మారకముందే మనం సమస్యల్ని గుర్తించి వాటిని పరిష్కరించేలా నైపుణ్యాలు పెరగాలి. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి చేసేలా ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తం కావాలి. దేశంలోని ప్రతీ పౌరుడి జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా మనం అంతా కలిసి పనిచేయాలి. పీ4 లాంటి కార్యక్రమాల ద్వారా జీవన ప్రమాణాలను పెంచటం సాధ్యం అవుతుంది. ప్రాంతాలు, భాషలు, సంస్కృతులూ వేరైనా దేశంగా మన అందరి లక్ష్యం ఒక్కటే. వచ్చే 20 ఏళ్లలో భారత్ అగ్రస్థానానికి ఎదగాలి. దానికి అనుగుణంగా మనం అంతా కలిసి పనిచేయాలని కోరుతున్నాను. గతంలోనే ఉమ్మడి ఏపీలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ద్వారా అధికారులు ఉద్యోగుల్లో సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేశాం. కెపాసిటి బిల్డింగ్ లో విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థలు సహకారం కూడా తీసుకుని ముందుకు వెళ్లాని అన్నారు.

# పొంగులేటి పై చర్యలకు సిద్ధమేనా?



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన చర్చనీయాంశమైంది. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఈడీ విచారణపై ఆరా తీస్తామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున ఈడీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించారు. రెండేళ్ల క్రితం జరిగిన సోదాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు తమకు చెప్పాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు.సోమవారం ఉదయం ఈడీ కార్యాలయం బయట బీఆర్ఎస్ నేతలు బైఠాయించి నినాదాలు చేస్తుండటంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొని పోలీసుల తీరుపై వాగ్వాదానికి దిగారు. అయితే, ఆ తర్వాత పోలీసుల అనుమతితో ఒక ప్రతినిధి బృందం ఈడీ అధికారులను కలిసే అవకాశం కల్పించారు. అయినా హడావుడి కోసం రోడ్డుపై బైఠాయించి ధర్నాచేసారు. కాంగ్రెస్ మంత్రులకు ఒక రకమైన న్యాయం, ప్రతిపక్ష నేతలకు మరో రకమైన న్యాయం జరుగుతోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ లో విమర్శలు చేశారు.చట్టబద్ధంగా నడిచే కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరులో జోక్యం చేసుకునే హక్కు ఏ రాజకీయ పార్టీకి ఉండదు. దర్యాప్తు ఏ దశలో ఉందనే అంశాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఈడీకి ఉండదు. కానీ, కేవలం రాజకీయంగా ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలనే ఉద్దేశంతో, తాము చెప్పినట్టుగానే దర్యాప్తు సంస్థలు పనిచేయాలని బీఆర్ఎస్ నేతలు ఒత్తిడి తెస్తుండటం విచిత్రంగా ఉందన్న వాదన వినిపిస్తోంది. ఒకవైపు సొంత పార్టీ నేతలు ఎదుర్కొంటున్న కేసుల విచారణ సమయంలో దర్యాప్తు సంస్థలను తప్పుపట్టిన గులాబీ నేతలు, ఇప్పుడు ఇతర పార్టీల నేతల విషయంలో తామే జ్యుడీషియరీగా మారిపోయి తీర్పులు చెప్పాలని చూస్తున్నారని అంటున్నారు.

# ఆరోగ్యమే అసలైన సంపద

## - గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకే 3కె వాకథాన్
## - కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ : ఉరుకులు పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే దాని ప్రభావం గుండెపై పడే అవకాశముందని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవడంతోపాటు సంతోషంగా,ఎక్కువ కాలం జీవించవచ్చని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు.వరల్డ్ హార్ట్‌డేను పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం 3కె వాకథాన్ నిర్వహించారు.మెడికవర్ ఆసుపత్రి నుంచి కోర్టు చౌరస్తా, తెలంగాణచౌక్ మీదుగా తిరిగి ఆసుపత్రి వరకు సాగిన వాకథాన్‌ను సీపీ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటేనే కుటుంబంతో, సమాజంతో సంతోషంగా గడపగలమన్నారు.నిత్యం వ్యాయామం చేయడం,పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం,సరిపడా నిద్రపోవడం,మానసికంగా ప్రశాంతంగా ఉండటం వంటి అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు.గుండె ఆరోగ్యం కేవలం వృద్ధాప్యంలో చూసుకోవాల్సిన అంశం కాదని,చిన్న వయస్సు నుంచే దానిపై శ్రద్ధ పెట్టాలని పిలుపునిచ్చారు.మెడికవర్ వైద్యులు మాట్లాడుతూ రక్తపోటు,మధుమేహం,కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవడంతో గుండె జబ్బుల ముప్పును తగ్గించుకోవచ్చన్నారు.క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం,వైద్యుల సూచనలు పాటించడం అవసరమని పేర్కొన్నారు.గుండె జబ్బు లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రి వస్తే 24 గంటల్లోనే స్టంట్ వేసి పంపించే టెక్నాలజీ కరీంనగర్‌లో అందుబాటులోకి వచ్చిందన్నారు.గతంలో పోలిస్తే గుండెపోటు మరణాలు కూడా తగ్గినట్లు వైద్యులు వెల్లడించారు.మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వాకథాన్‌లో కార్డియాలజిస్టులు డాక్టర్ అనీష్ పబ్బ,డాక్టర్ వాసుదేవరెడ్డి,డాక్టర్ సతీష్‌కుమార్,సి.టి.సర్జన్ డాక్టర్ రవి కుమార్,అనెస్తీషియా వైద్యులు డాక్టర్ వినయ్‌కుమార్,డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి,జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ నాగరాజు,డాక్టర్ లోకేష్,ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేష్,న్యూరోసర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి,క్రిటికల్‌కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి,అభిషేక్,యూరాలజిస్టు డాక్టర్ రవిశంకర్,ఈఎన్‌టీ డాక్టర్ శ్రీపతినాయుడు,సూపరింటెండెంట్ ప్రియాంక,సీఎస్‌వో గౌస్‌బాబా,మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్,హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్,ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 50 శాతం సబ్సిడీతో పశువుల దాణ

## పశువైద్యాధికారి బాలకృష్ణ

తుగ్గలి: తుగ్గలి మండల పరిధిలోని గల చెన్నంపల్లి గ్రామంలో పశుపోషకులకు 50 శాతం రాయితీపై సమీకృత దాణాను పశు వైద్యాధికారి బాలకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు రైతు సేవాకేంద్రాలు,పశు వైద్యశాలల ద్వారా ఒక కేజీ 11 రూపాయలకు పంపిణీ చేయనుందని,సబ్సిడీ పోను 50 కేజీల దాణాపాకెట్ ఐదు వందల యాభై ఐదు రూపాయల మాత్రమే రైతులు చెల్లించాలని,తెల్లరేషన్ కార్డు కలిగిన పశుపోషకులు ఈ లబ్ధి పొందేందుకు అర్హులని ఆయన తెలియజేశారు.అదేవిధంగా పాడి రైతులు దాణా కావలసిన వారు తమ దగ్గరలోని రైతు సేవ కేంద్రం లేదా పశు వైద్యశాల సిబ్బందిని సంప్రదించాలని పశువైద్యాధికారి బాలకృష్ణ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయ సిబ్బంది మురళి, దివాకర్ నాయుడు,గోపాల మిత్ర, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా క్వారీ నుండి రోడ్లకు మట్టి తరలింపు

గోకవరం:మండలంలో అభివృద్ధి కార్యక్రమాల్లో ఒక భాగంగా గోకవరం కోరుకొండ మండలం ఇటిక్యాల పల్లి బోలేతుపాలెం నుండి గోకవరం వరకు తారు రోడ్ వేయడం జరుగుతుంది. ఈ రోడ్డు ప్రజలకు ఉపయోగం తో పాడు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఆరోపణలు కూడా వస్తున్నాయి. రోడ్డు విరువైపుల ఎడ్జీలకు మట్టి వేయడానికి రెవెన్యూ శాఖ నుండి అనుమతులు లేకుండా అక్రమంగా లారీలతో మట్టి తరలించి రోడ్డుకు ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డుకి విరువైపులా మట్టి వేయాలంటే రెవిన్యూ శాఖ నుంచి పర్మిషన్ పెట్టుకోవాలి. మరోపక్క ఆర్ అండ్ బి అధికారులు టెస్టింగ్ చేసి ఈ మట్టి నాణ్యత ఉందా లేదా అని క్వాలిటీ కంట్రోల్ చేసిన తర్వాత మాత్రమే మట్టి ఎడ్జీలకు ఉపయోగిం చాలి. కానీ అటువంటిదేమీ లేకుండా అతి దగ్గరలో మట్టి దొరుకుతుందని రోడ్లకు ఉపయోగిస్తున్నారు. ఇంత అక్రమంగా మట్టి తరలిస్తున్న ఇటు రెవెన్యూ అధికారులు ఆర్ అండ్ బి అధికారులు మాత్రం కన్నెత్తి చూడక పోవడం కోస మెరుపు. ఇప్పటికైనా రెవెన్యూ ఆర్ అండ్ బి ఉన్నతాధికారుల స్పందించి తరలిస్తున్న మట్టికి నాణ్యత ఉందా పర్మిషన్ ఉందా అనేది ఎంక్వైరీ చేస్తే నిజాలు వెలుగులోకి వస్తే అని పలువురు కోరుతున్నారు...

# దేవీపట్నం మండలంలో అధ్వాన్నంగా పంచాయతీ పాలన..

## 20 రోజులుగా చీకట్లోనే ఇందుకూరుపేట

దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామ పంచాయతీ పనితీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వీధి దీపాలు గత 20 రోజులుగా వెలగకపోయినా, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంవీధిలైట్ల సమస్యపై పంచాయతీ కార్యదర్శి కి 20 రోజులుగా ఫిర్యాదు చేస్తున్నామని, అయినా ఆమె "పంచాయతీలో బడ్జెట్ లేదు, చెరువు పాటల వేలం జరిగాకే నిధులు వస్తాయి, అప్పుడే లైట్లు వేయిస్తాం" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.చీకటిలోనే గ్రామస్తుల జీవనంసాయంత్రం కాగానే గ్రామం మొత్తం చీకట్లోకి వెళ్తోంది. వీధిలైట్లు లేక మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పాములు, తేళ్లు, దోమల బెడద పెరిగిందని, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పంచాయతీ ఉండి కూడా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై ప్రభుత్వం స్పందించాలని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వెంటనే ఇందుకూరుపేటలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

# గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు

నర్సింహులపేట: గుడుంబా తయారీ, విక్రయాలపై నర్సింహులపేట పోలీసులు కొరడా ఝుళిపించారు. కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా గోపా తండా గ్రామపంచాయతీ పరిధిలోని చింతల తండా, అమిరియా తండా, కొత్త తండాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 2 వేల లీటర్ల బెల్లం వాష్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే 3 క్వింటాళ్ల నల్ల బెల్లం, 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15 మంది వ్యక్తుల వద్ద ఈ పదార్థాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తుల పూర్వ నేర చరిత్ర, బైండ్‌ఓవర్ వివరాలను పరిశీలించి, చట్ట ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడుల్లో తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గణేష్‌తో పాటు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నరసరావుపేటలో యువకుడు దారుణ హత్య

పల్నాడు : నరసరావుపేట కాసు బ్రహ్మానందరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ లో అర్ధరాత్రి యువకుడు హత్య కు గురయ్యాడు. రాయితో తలపై కొట్టి గుర్తుతెలియని దుండగులు హత్య చేసారు. మృతుడు నరసరావుపేట పెదచెరువుకు చెందిన తాపిమేస్త్రీ రాజేష్ 36 గా గుర్తించారు. గత రాత్రి షాపింగ్ కాంప్లెక్స్ లో రాజేష్ మద్యం సేవించి నిద్రపోయాడు. మృతుని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వైయస్ జగన్ ఒంగోలు పర్యటన

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంగోలులో పర్యటించారు.ఒంగోలు క్లౌ పేటలోని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ దివంగత కాకుమాను రాజశేఖర్ నివాసానికి వెళ్లిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.కాకుమాను రాజశేఖర్ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన శ్రీ వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు.కాకుమాను రాజశేఖర్ పార్టీకి అందించిన సేవలను ఈ సందర్భంగా వైయస్ జగన్ గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో, అంకితభావంతో ఆయన పనిచేశారని పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.రాజశేఖర్ కుటుంబం ఒంటరిది కాదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందనివైయస్ జగన్ భరోసా ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

# కవితా పోటీల్లో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఉట్నూర్ : గురజాడ వెంకట అప్పారావు జయంతి సందర్భంగా ఆర్గనైజేషన్ ఆఫ్ గ్లోబల్లీ యునైటెడ్ టీచర్స్ సాహిత్య విభాగం నిర్వహించిన ఆన్‌లైన్ కవితా పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొని ప్రశంసా పత్రాలను సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను అధ్యాపక బృందం ఘనంగా అభినందించింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా తమలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీస్తూ రాష్ట్రస్థాయి వేదికలపై ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు విద్యార్థులలో ఆలోచనా పరిధిని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొంటూ కళాశాల కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు.అనంతరం లిటరరీ సమన్వయకర్త డా. పి. కిషన్ మాట్లాడుతూ.. విద్యార్థులలోని సాహిత్య అభిరుచిని గుర్తించి ప్రోత్సహించడానికి కళాశాల నిరంతరం కృషి చేస్తుందన్నారు. గురజాడ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రశంసా పత్రాలు సాధించడం ఎంతో గర్వకారణమని కొనియాడారు.తెలుగు అధ్యాపకుడు ఎ. కపిల్ మాట్లాడుతూ.. గురజాడ వెంకట అప్పారావు తెలుగు సాహిత్యానికి అందించిన నూతన ఒరవడిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చక్కని భావాలతో కవితలు రాసి ప్రతిభ చాటారని పేర్కొన్నారు.

### యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా..

# భారత్ కీలక నిర్ణయం!

## క్షిపణుల తయారీలోకి ప్రైవేట్ కంపెనీలు - ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు

### యుద్ధ సమయంలో ఉత్పత్తికి ప్రత్యామ్నాయం - డీఆర్‌డీవో టెక్నాలజీ బదిలీకి అనుమతి - సరఫరా సమయం మెరుగుపడొచ్చని నివేదిక



హైదరాబాద్ : యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది.ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్-కమ్-ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు.పోటీతో ధరలు, డెలివరీపై ప్రభావంఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది.యుద్ధ సమయంలో ఉత్పత్తే కీలకందీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.ఇక పోటీ తప్పనిసరిడీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

# బోరు వేస్తే ఇంకుడు గుంత ఉండాల్సిందే

కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ పరిధిలో భూగర్భ జలాల పరిరక్షణకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పర్యావరణ, సామాజిక కార్యకర్తలు కోరారు. విచ్చలవిడిగా బోర్లు వేయడం,వాటర్ ఫిల్టర్ కేంద్రాల నుంచి శుద్ధి ప్రక్రియలో మిగిలే నీటిని రోడ్లు, డ్రైనేజీలు,బహిరంగ ప్రదేశాల్లోకి వదలడం వల్ల నీటి వృథాతో పాటు భూగర్భ జలాలపై ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ తహసీల్దార్ భైరెడ్డి రాజేష్,జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌లకు వినతిపత్రాలు సమర్పించారు.ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఉంటేనే బోరుకు అనుమతి ఇవ్వాలి:ప్రతి ఇంటి యజమాని తమ ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసిన తర్వాతే బోరు ఏర్పాటుకు అనుమతి ఇచ్చేలా నిబంధనలు తీసుకురావాలని పర్యావరణ, సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ కోరారు. ఇప్పటికే ఉన్న బోర్లపై అధికారులు నిఘా పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, సంబంధిత నీటి విభాగాల అధికారులు బోరు యజమానులకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన చోట నోటీసులు జారీ చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించి, సంబంధిత బోరు యజమానులకు నోటీసులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.కొత్త లేఅవుట్లలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం:కొత్త లేఅవుట్లు, హెచ్ఎండీఏ, డీపీ లేఅవుట్లలో వర్షపు నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణం, లేఅవుట్ అనుమతులతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటును తప్పనిసరి చేసేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. ఇంకుడు గుంత ఉన్న ఇళ్లు, ప్లాట్లకే రిజిస్ట్రేషన్, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీల విషయంలో అర్హత కల్పించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

# సిరిసిల్లలో రేవంత్ అసలు టార్గెట్ ఇదేనా?

### కేటీఆర్ కోటనే ఎందుకు ఎంచుకున్నారు?



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం ప్రస్తుతం బీఆర్ఎస్ కీలక నాయకుల సొంత నియోజకవర్గాల చుట్టూ తిరుగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా నాలుగుసార్లు ప్రాతినిధ్యం వహించిన సిరిసిల్ల స్థానంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. సుమారు రూ.1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభను కాంగ్రెస్ ప్లాన్ చేసింది. పదేళ్ల పాలనలో కేటీఆర్ సిరిసిల్లను ఆదర్శంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటుంటే, నాలుగుసార్లు గెలిపించిన ప్రజలకు సరైన అభివృద్ధి చేయలేదు అని రేవంత్ ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది. కేటీఆర్ గడపలోనే ఆయన వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా రాజకీయంగా మానసిక ఆధిపత్యం సాధించాలనేది కాంగ్రెస్ ప్రధాన వ్యూహం.సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించబోయే సభ సాధారణ ప్రభుత్వ కార్యక్రమంగానో లేదా పార్టీ సభగానో కాకుండా అంతకు మించి ఉండబోతోందన్న సంకేతం కనిపిస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ కూడా. ఎందుకంటే రేవంత్ ఎంచుకున్నది సాధారణ నియోజకవర్గం కాదు. అది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల.అక్కడే భారీ బహిరంగ సభ.. దానికి ముందు నాలుగు కిలోమీటర్ల రోడ్‌షో.. రాష్ట్రంలోని కీలక మంత్రులు, కాంగ్రెస్ నేతల మోహరింపు.. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నుంచి జన సమీకరణ.. ఇవన్నీ చూస్తే రేవంత్ పర్యటనను కేవలం అభివృద్ధి కార్యక్రమాల పర్యటన కాదు.. మరోవైపు బీఆర్ఎస్ కంచుకోటలో కాంగ్రెస్ రాజకీయ శక్తిని ప్రదర్శించడ కూడా ఈ సభలోని రెండు ప్రధాన లక్ష్యాలు.కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం, వచ్చే ఏడాది నుంచి నీటి నిల్వరేవంత్‌కు సిరిసిల్లలో ఒక ప్రత్యేక రాజకీయ లెక్క ఉంది. కేటీఆర్‌కు ఇది కేవలం ఎమ్మెల్యే నియోజకవర్గం కాదు. 2009, 2014, 2018, 2023 ఎన్నికల వరకు సిరిసిల్లలో కేటీఆర్ వరుస విజయాలు సాధించారు. అంటే సిరిసిల్లలో కేటీఆర్ అజేయుడు కాదనే పొలిటికల్ నరేటివ్ సృష్టించడం రేవంత్ ముఖ్య వ్యూహం కావచ్చు. రాజకీయాల్లో ప్రత్యర్థి బలహీనంగా ఉన్న చోట బలం చూపించడం పెద్ద విషయం కాదు. ప్రత్యర్థి బలమైన చోటికి వెళ్లి బలం చూపించడమే పెద్ద మెసేజ్ ఇస్తుంది. రేవంత్ సిరిసిల్ల ద్వారా అదే సందేశాన్ని ఇవ్వాలని చూస్తున్నారా? అనేది ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్న.సిరిసిల్ల సభను కేవలం రేవంత్ వర్సెస్ కేటీఆర్‌గా చూడటం ఈ వ్యూహాన్ని చిన్నదిగా చూసినట్టే. రేవంత్ లక్ష్యం బీఆర్ఎస్ రాజకీయ మానసిక ఆధిక్యాన్ని సవాలు చేయడం కావచ్చు. కేటీఆర్ సిరిసిల్లలో గెలవడం ఒక ఎన్నికల ఫలితం.కానీ "కేటీఆర్ అంటే సిరిసిల్ల.. సిరిసిల్ల అంటే కేటీఆర్" అనే రాజకీయ ఇమేజ్‌ను మార్చడం మాత్రం చాలా పెద్ద రాజకీయ విజయం అవుతుంది. అందుకే సభకు వచ్చే జనసందోహం, రోడ్‌షోలో కనిపించే స్పందన, స్థానిక నేతల పాల్గొనడం, కేటీఆర్‌పై రేవంత్ చేసే రాజకీయ దాడి కంటే కూడా సిరిసిల్ల ప్రజల్లో కాంగ్రెస్‌కు పొలిటికల్ స్పేస్ ఎంత? అన్నదే కాంగ్రెస్‌కు ముఖ్యమైన కొలమానం.ఇక్కడ మరో కీలక అంశం ఉంది. సిరిసిల్ల సభను కాంగ్రెస్ ఒక నియోజకవర్గ కార్యక్రమంగా కాకుండా రాష్ట్రస్థాయి పవర్ షోగా మలచడానికి ప్రయత్నిస్తోంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నాలుగు కిలోమీటర్ల రోడ్‌షోతో పాటు భారీ జన సమీకరణకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది.అంటే "కేటీఆర్‌ను ఓడించగలమా?" అన్నదానికంటే ముందుగా.."కేటీఆర్ కోటలో కాంగ్రెస్ ఎంత పెద్ద రాజకీయ శక్తిగా కనిపించగలదు? అన్న ప్రశ్నకు సమాధానం చూపించాల్సిన వేదికగా సిరిసిల్లను మలుస్తున్నట్టు కనిపిస్తోంది.ఈ వ్యూహం ఒక్కరోజులో పుట్టింది కాదు. సెప్టెంబర్ 5న నకిరేకల్ సభలోనే రేవంత్‌రెడ్డి సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్‌లను ప్రస్తావించారు. సిరిసిల్లలో కేటీఆర్‌ను, సిద్ధిపేటలో హరీశ్‌రావును, గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. సిరిసిల్లకు సెప్టెంబర్‌లో, సిద్ధిపేటకు అక్టోబర్‌లో వెళ్తానని చెప్పారు. అంటే సిరిసిల్ల ఒక టెస్ట్ కేసు.ఇక్కడ కాంగ్రెస్ నిర్వహించే సభకు వచ్చే స్పందన ఎలా ఉంటుంది? స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఎంతవరకు సమన్వయంతో పనిచేస్తుంది? కేటీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న స్థానిక అసంతృప్తిని కాంగ్రెస్ ఎంతవరకు రాజకీయంగా ఉపయోగించుకోగలదు? ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎంతవరకు కనెక్ట్ చేయగలదు? ఈ ప్రశ్నలకు సిరిసిల్లలో రేవంత్‌కు వచ్చే సమాధానం తర్వాతి అడుగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

రేవంత్ సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ సభల ద్వారా మూడు రాజకీయ సందేశాలను పంపాలనుకుంటున్నారు. 1. బీఆర్ఎస్ కోటల్లోకీ కాంగ్రెస్ వస్తుంది, ఇది కేటీఆర్‌కు మాత్రమే కాదు.. బీఆర్ఎస్ కేడర్‌కు కూడా ఇచ్చే సందేశంగా చూడొచ్చు. 2. కాంగ్రెస్ కేవలం అధికారంలో ఉన్న పార్టీ కాదు.. ఎన్నికల మోడ్‌లో ఉన్న పార్టీ అని చెప్పడం అది పార్టీ కేడర్‌కు కూడా ఒక మెసేజ్ ఇస్తుంది. 3. బీఆర్ఎస్ పునరాగమనానికి అవకాశం లేదన్న నరేటివ్ సృష్టించడం. ఇక్కడే సిరిసిల్ల సభ మరింత ఆసక్తికరంగా మారింది. పైగా ఇప్పుడు ఏం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. రేవంత్ "నేను నీ కోటలోకి వస్తున్నా" అనే రాజకీయ సందేశం ఇవ్వబోతుంటే.. కేటీఆర్ మాత్రం "వస్తున్నారు కదా.. మా ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అంటూ చర్చను మరో ట్రాక్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. సెప్టెంబర్ 27న కేటీఆర్ రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలపై ఆధారాలు ముందు పెట్టాలని కోరారు. అక్కడితో ఆగలేదు. సిరిసిల్ల నేతన్నలకు కోట్ల రూపాయల బకాయిలు, యార్న్ సబ్సిడీ, నేతన్న బీమా, వీవింగ్ పార్క్, రైతు భరోసా, రుణమాఫీ తదితర అంశాలపై కూడా సీఎం సమాధానం చెప్పాలని కోరారు. అంటే ఇప్పుడు రేవంత్ ముందున్న రాజకీయ సవాలు కొంత మారింది.ఇక్కడే సెప్టెంబర్ 30 ప్రసంగం కీలకంగా మారనుంది. రేవంత్ కేవలం "కేటీఆర్ ఓడిపోతారు" అని మాట్లాడితే అది సాధారణ రాజకీయ విమర్శగా మిగిలిపోవచ్చు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వంలో నిధులన్నీ గజ్వేల్, సిద్ధిపేట, సిరిసిల్లలకే వెళ్లాయి.. అభివృద్ధి అంటే ఈ మూడు నియోజకవర్గాలేనా అన్న ప్రశ్న ఎదురైంది. అలాంటి పరిస్తితుల్లో రేవంత్ అక్కడికెల్లి స్థానికులకు కొత్తగా ఏం హామీలివ్వగలరు. కానీ సిరిసిల్లకు సంబంధించిన స్పష్టమైన లెక్కలు చెబితే? ఎన్ని పనులు చేశాం? ఎన్ని నిధులు ఇచ్చాం?ఏ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు చేశాం? నేతన్నలకు ప్రభుత్వం ఏం చేసింది? రాబోయే రోజుల్లో ఏం చేయబోతున్నాం? ఇలా సిరిసిల్లకే ప్రత్యేకమైన లెక్కలతో మాట్లాడితే సభకు వేరే రాజకీయ బలం వస్తుంది. అందుకే రేవంత్ ప్రసంగంలోని రాజకీయ పంచ్‌లపై మాత్రమే కాదు.. ఆయన చెప్పబోయే సిరిసిల్ల స్పెసిఫిక్ డేటాపైనా ఇప్పుడు అందరి దృష్టి ఉంది.ఇది బహుశా మొత్తం వ్యూహంలో అత్యంత ముఖ్యమైన అంశం. ఈ మూడు నియోజకవర్గాలు ఒకే రాజకీయ కుటుంబం, ఒకే పార్టీ అగ్రనాయకత్వంతో బలంగా అనుసంధానమై ఉన్నాయి. అందుకే రేవంత్ ఈ మూడు ప్రాంతాల్లో వరుసగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తే అది కేవలం నియోజకవర్గాల పర్యటన కాదు. బీఆర్ఎస్ రాజకీయ కేంద్రాల చుట్టూ కాంగ్రెస్ తన రాజకీయ కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ రాజకీయ చర్చలో ప్రధాన ప్రశ్న "కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?" అని రేవంత్ సిరిసిల్ల-సిద్ధిపేట వ్యూహం ఆ చర్చను మరో ప్రశ్నవైపు తిప్పాలనుకుంటున్నారు. "2028లో బీఆర్ఎస్ తిరిగి వస్తుందా?" లేదా "కాంగ్రెస్ బీఆర్ఎస్ బలమైన కోటలను కూడా బద్దలు కొట్టగలదా?" ఇది కాంగ్రెస్‌కు అనుకూలమైన చర్చగా మారుతుందా, బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఉపయోగపడుతుందా అన్నది భవిష్యత్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. రెండు పార్టీల మధ్య 2028 పోటీకి దేఖ్ లేంగే నినాదం మాత్రం మొదలైంది. ఈ ప్రశ్నకు సమాధానం ఈ వరుస సమావేశాలు చేప్తాయి.. వేలకోట్ల నిధులతో అభివృద్ధి చేసిన నియోజకవర్గాల్లో రేవంత్ స్థానికంగా ఎంత బల ప్రదర్శన చేయగలరు. వాటి ప్రభావంతో ఆయా నియోజకవర్గాల్లో బీఆరెస్ స్థైర్యాన్ని దెబ్బతీయగలరా. భారీ జనసమీకరణ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలకు నూతన ఉత్సాహాన్ని నింపగలరా అనేది ఈ సభల విజయాపజయాలు నిర్ణయించనుంది. మొత్తానికి దూకుడుకు మారు పేరైన రేవంత్ రాజకీయ వ్యూహాలు ఈ కొత్త దూకుడుతో ఏం చేస్తారో చూడాలి.

# రాయదుర్గం మున్సిపల్ పీఠం ఎవరికో?

### కూటమిలో జోరుగా చైర్మన్ సీటు వేట.. రిజర్వేషన్లపైనే నేతల కన్ను

రాయదుర్గం : మున్సిపల్ ఎన్నికల నగారా త్వరలోనే మోగనుండటంతో అనంతపురం జిల్లా రాయదుర్గం పురపాలక సంఘంలో రాజకీయ వేడి రాజుకుంది. వచ్చే అక్టోబరులో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా, కూటమి పార్టీల్లో చైర్మన్ పీఠం కోసం తీవ్ర పోటీ నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లో మొత్తం 53,696 మంది ఓటర్లు ఉండగా, 80 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే, చైర్మన్ సీటు రిజర్వేషన్ ఖరారు కాకముందే ప్రధాన కూటమి పార్టీలైన తెదేపా, జనసేన, భాజపాల్లో ఆశావాహులు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.తెదేపాలో జోరుగా లాబీయింగ్.. చైర్మన్ పీఠం తమకే దక్కుతుందన్న ధీమాతో తెదేపాలోని పలువురు సీనియర్ నాయకులు సీటు కోసం పట్టుబడుతున్నారు. చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, గార్మెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు రేసులో ముందు వరుసలో ఉన్నారు.పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరల పురుషోత్తం కూడా పార్టీకి చేసిన సేవలను గుర్తిస్తూ తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మహిళలకు రిజర్వేషన్ కేటాయిస్తే రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన అనుభవం ఉన్న కురుబ ప్రశాంతి తనకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఓసీ జనరల్ అయితే, పేదలకు అందించిన ఉచిత వైద్య సేవలను పరిగణనలోకి తీసుకుని అవకాశం ఇవ్వాలని డాక్టర్ శ్రీరామరెడ్డి అధిష్టానం వద్ద మంతనాలు జరుపుతున్నారు. మైనారిటీ కోటాలో మాజీ వైస్ చైర్మన్, తెదేపా జిల్లా కోశాధికారి కడ్డిపూడి మహబూబ్ బాషా టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.వీరితో పాటు బండి భారతి, బండి కృష్ణమూర్తి, బంగి ఉమాశంకర్, పద్మజ తదితరుల పేర్లు చర్చల్లో ఉన్నాయి.

పొత్తులో మాకంటే మాకంటూ.. పొత్తులో భాగంగా ఈసారి తమకే చైర్మన్ సీటు కేటాయించాలని జనసేన, భాజపాలు గట్టిగా కోరుతున్నాయి. జనసేన కు కేటాయిస్తే ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కరేగౌడరావు మంజునాథ్ పేరు ఖరారయ్యే అవకాశాలున్నాయి.మరోవైపు భాజపా కూడా పట్టుబడుతుండటంతో ఆ పార్టీ తరఫున జీవి నాయుడు (నాని) పేరు బలంగా వినిపిస్తోంది. అధిష్టాన నిర్ణయానికే కట్టుబడి ఉంటామని జింకా వసుంధర స్పష్టం చేశారు.ఏదేమైనా, ప్రభుత్వం అధికారికంగా రిజర్వేషన్లను ఖరారు చేసిన అనంతరమే రాయదుర్గం మున్సిపల్ పీఠం ఎవరికి దక్కుతుందనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

### అమెరికాలో స్టీల్ ప్లాంట్ కోసం ఎస్సార్ గ్రూప్

# 18 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి

న్యూఢిల్లీ : ఒకప్పుడు చిన్న నిర్మాణ సంస్థగా మొదలైన భారతీయ కంపెనీ ఒకటి, ఇప్పుడు అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైంది. ఆ కంపెనీయే ఎస్సార్ గ్రూప్. శశి రుయా, రవి రుయా అనే ఇద్దరు సోదరులు స్థాపించిన ఈ సంస్థ, అమెరికాలో ఉక్కు రంగంలో సుమారు 18 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 1.4 లక్షల కోట్లు) భారీ పెట్టుబడి పెట్టబోతోంది. ఈ ప్రాజెక్టును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా చరిత్రలోనే అతిపెద్దదిగా అభివర్ణించడం దీని ప్రాధాన్యతను తెలియజేస్తోంది.ఎస్సార్ గ్రూప్ ప్రస్థానం 1969లో చెన్నైలో మొదలైంది. శశి, రవి రుయా సోదరులు తమ తండ్రి నంద్ కిశోర్ రుయా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, చెన్నై పోర్టులో ఔటర్ బ్రేక్‌వాటర్ నిర్మాణానికి రూ. 2.5 కోట్ల కాంట్రాక్టుతో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. తమ పేర్లలోని మొదటి అక్షరాలైన శశి, రవి కలిసొచ్చేలా 'ఎస్సార్' అని కంపెనీకి నామకరణం చేశారు. అక్కడి నుంచి ఈ గ్రూప్ వెనుదిరిగి చూసుకోలేదు. షిప్పింగ్, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్, విద్యుత్, పోర్టులు, టెలికాం వంటి అనేక రంగాల్లోకి విస్తరించి, ప్రపంచవ్యాప్తంగా దూకుడుగా పెట్టుబడులు పెట్టే భారతీయ సంస్థల్లో ఒకటిగా నిలిచింది.సోదరుల్లో పెద్దవాడైన శశి రుయా గ్రూప్ విస్తరణలో కీలక పాత్ర పోషించారు. ఆయన నవంబర్ 2024లో తన 80వ ఏట కన్నుమూశారు. ఇంజనీర్ అయిన చిన్న సోదరుడు రవి రుయా, సంస్థ కార్యకలాపాలను ఏకీకృతం చేయడంతో పాటు అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా దేశాలకు వ్యాపారాన్ని విస్తరించడంలో ప్రధాన భూమిక పోషించారు.

రుణాల సంక్షోభం నుంచి పునరుజ్జీవం

భారత ఆర్థిక వ్యవస్థ సరళీకరణ తర్వాత ఎస్సార్ గ్రూప్ వేగంగా విస్తరించినప్పటికీ, అదే స్థాయిలో భారీ అప్పుల్లో కూరుకుపోయింది. ముఖ్యంగా, ఎస్సార్ స్టీల్ ఇండియా దివాలా తీయడంతో, దానిని ఆర్సెలర్ మిట్టల్-నిప్పాన్ స్టీల్ సంస్థకు విక్రయించాల్సి వచ్చింది. అలాగే, ఎస్సార్ ఆయిల్ సంస్థను 12.9 బిలియన్ డాలర్లకు అమ్మివేసి, ఆ వచ్చిన నిధులతో రుణ భారాన్ని గణనీయంగా తగ్గించుకున్నారు. ఈ వ్యూహాత్మక విక్రయాల తర్వాత ఎస్సార్ గ్రూప్ ఇప్పుడు అమెరికాపై దృష్టి సారించింది. ఇప్పటికే మిన్నెసోటాలో 'మెసాబి మెటాలిక్స్' పేరుతో ఇనుప ఖనిజం తవ్వకాలు ప్రారంభించింది.

గత 50 ఏళ్లలో అమెరికాలో మొదలైన మొట్టమొదటి కొత్త ఇనుప ఖనిజ గని ఇదే కావడం విశేషం. తాజాగా ప్రకటించిన అయోవా స్టీల్ ప్లాంట్, ఈ మిన్నెసోటా గనుల నుంచి వచ్చే ముడిసరుకును వినియోగించుకోనుంది. ఏటా 10 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. 2030 నాటికి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రవి రుయా కుమారుడు రేవంత్ రుయా, ఇతర కుటుంబ సభ్యులు ఈ కొత్త తరం వ్యాపార కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకుంటూ సంస్థ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు.

# 8 నెలల్లో 5,800 పోలీసు పోస్టుల భర్తీ

శ్రీకాకుళం : రాష్ట్ర ప్రగతికి శాంతిభద్రతలే పునాది అని, ఆంధ్రప్రదేశ్‌లో లా అండ్ ఆర్డర్ పటిష్ఠంగా ఉండటం వల్లే పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించగలుగుతున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన కానిస్టేబుళ్ల పాసింగ్-అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.10 నెలల కఠిన శిక్షణ పూర్తి చేసుకున్న 142 మంది నూతన కానిస్టేబుళ్లను మంత్రి అభినందించారు. పోలీసు వృత్తిలోకి అడుగుపెడుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు ఉద్యోగం కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని గుర్తుచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పోలీసు నియామకాలపై మంత్రి కీలక ప్రకటన చేశారు. గత 8 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,800 పోలీసు పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. తాజాగా మరో 1,156 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. ఇకపై ప్రతి ఏటా క్రమం తప్పకుండా పోలీసు నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. నేరాల నియంత్రణకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు.

# వైసీపీకి షాక్.. టీడీపీలోకి 40 మంది చేరిక

### 9వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ:ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహిస్తున్న మన భూమా మన ధీమా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 9వ వార్డు కొత్త మసీదు ఏరియాలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా 9వ వార్డుకు చెందిన నూర్‌బాషా కుటుంబ సభ్యులు, ఆయన సోదరులు, మహబూబ్ బాషా , గౌస్ లాజం, జిలాన్ భాష, వసీం అక్రమ్, హాజీవ్ అలీ, అబ్దుల్, మహబూబ్ బి, రజియా, గౌసియా, మా భుచాన్ ,హాసన్ , రసూల్ బి,మరో 10 కుటుంబాలకు చెందిన మొత్తం 40 మంది వైఎస్సార్‌సీపీని వీడి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఆమె తెలిపారు.కార్యకర్తలను ఇబ్బంది పెట్టే సంస్కృతి మాది కాదుగతంలో 2014?2015 సమయంలో టీడీపీ కోసం పనిచేసిన కార్యకర్తలపై బైండోవర్ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని కొంతమంది కార్యకర్తలు ఈరోజు నా దృష్టికి తీసుకొచ్చారు. గతంలో జరిగిన ఘటనల గురించి కూడా ప్రజలు, కార్యకర్తలు వివరించారు.కానీ ఈ రెండేళ్లలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆళ్లగడ్డలో ఎక్కడైనా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడ్డామా? ఎవరినైనా అనవసరంగా ఇబ్బంది పెట్టామా? అనే విషయాన్ని ప్రజలు గమనించాలి.జెండా పట్టుకుని పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను ఇబ్బంది పెట్టే సంస్కృతి మాది కాదు. మా పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం. ఆళ్లగడ్డలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ ప్రశాంతంగా జీవించాలన్నదే మా లక్ష్యం.ఆళ్లగడ్డ అభివృద్ధికి రూ.21 కోట్లుఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రూ.21 కోట్ల నిధులు కేటాయించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నాం.గతంలో పట్టణంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉండేవి. ప్రస్తుతం అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పడకండ్ల ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నాం. ములకలవాగు నీటిని తీసుకురావడం ద్వారా ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు గతంలోనే చర్యలు తీసుకున్నాం.ప్రజలు ఎక్కడైనా రోడ్డు కావాలని, డ్రైనేజీ కావాలని అడిగితే సమస్యను పరిశీలించి పరిష్కరించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నాం.కులమతాలకు అతీతంగా అభివృద్ధిరాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తోంది.కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కూడా అదే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నాం.వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలిగత ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి పనులు ప్రస్తుతం మా ప్రభుత్వంలో జరుగుతున్నాయి. ప్రజలు అభివృద్ధిని గమనిస్తున్నారు. కార్యకర్తలు కూడా అభివృద్ధి పనులను చూసి మా పార్టీలోకి వస్తున్నారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES గురువారం, అక్టోబర్ 1, 2026

## మండల వ్యాప్తంగా విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు పూర్తి

తుగ్గలి: తుగ్గలి మండల వ్యాప్తంగా నిర్వహించిన విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు ముగిశాయని మండల విద్యాధికారులు ప్రవీణ, రమా వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతుగ్గలి మండలంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని వారు తెలియజేశారు.మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో మండలంలోని మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలల్లోఎంపీపీఎస్,ఎంపియుపిస్, జడ్.పి.హెచ్.ఎస్,కేజీబీవీ,ఆశ్రమ పాఠశాలలో ఎన్నికల ప్రక్రియ చేపట్టగా,63 పాఠశాలల్లో నూతన చైర్మన్లు,వైస్ చైర్మన్ల ఎన్నికలు పూర్తయ్యాయని వారు తెలియజేశారు. మండల పరిధిలోని గల రామాపురం ఎంపియుపిఎస్ పాఠశాల యందు రాజకీయ సమస్య కారణంగా,ముక్కెళ్ల జడ్పీ హైస్కూల్ నందు కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు వారు తెలియజేశారు. వాయిదా పడిన రెండు పాఠశాలల్లో త్వరలోనే తిరిగి ఎన్నికలు నిర్వహించి పూర్తి చేస్తామని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.విద్యా కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ లుగా ఎన్నికైన సభ్యులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,నాయకులు ఘనంగా సన్మానించారు. ఎన్నికైన నూతన కమిటీలు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ,మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఏకగ్రీవం

చాగలమర్రి: చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్ గా కసినేని ఓబులేసు, ఉపాధ్యక్షులుగా అమీర్, సభ్యులుగా కింగ్ హుస్సేన్, నూరి, రమణ, లక్ష్మీనారాయణ రెడ్డి, గౌసియా, అంజనమ్మ, శారద, జ్యోతి, గంగాదేవి తదితరులు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా చైర్మన్ గా ఎన్నికైన కసినేని ఓబులేసు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అన్ని రకాలుగా తాను కృషి చేస్తానని, ఈ అవకాశం కల్పించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు, నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, చాగలమర్రి టిడిపి పట్టణ అధ్యక్షులు మౌలాలి, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, టైలర్ భాష, సయ్యద్ బషీర్, బాల దస్తగిరి, పీరయ్య, కింగ్ హుస్సేన్, కలాంబిడి బషీర్, దస్తగిరి, సుద్ధపల్లి వలి, మోహన్, సురేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువలోకి డ్రైనేజీ నీరు..

తిరుపతి: న్యూఇందిరానగర్ ప్రాంతంలోని సైడ్ కాలువలో మురుగునీరు నిలిచిపోయిన సమస్యపై మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. సమస్యపై సమాచారం అందిన వెంటనే సంజయ్ గారు, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పందించి సిబ్బందిని కాలువను శుభ్రం చేయించారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.అయితే డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి మల వ్యర్థాలు కాలువలోకి చేరుతున్న సమస్యకు ప్రస్తుతం చేపట్టిన చర్య తాత్కాలిక పరిష్కారం మాత్రమేనని స్థానికులు పేర్కొంటున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి కాలువ వైపు వస్తున్న పైపును మళ్లించి, మల వ్యర్థాలు కాలువలోకి రాకుండా ప్రస్తుతం అడ్డుకోవడం జరిగిందని తెలిపారు.మళ్లీ ఇదే సమస్య తలెత్తకుండా డ్రైనేజీ పైప్‌లైన్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి, మల వ్యర్థాలు కాలువలోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై వెంటనే స్పందించి కాలువను శుభ్రం చేయించిన సంజయ్ శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటయ్య కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన సమస్యకు కూడా త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

## లక్ష్మీ భాస్కర్ అక్రమ దందాలు

### నిమ్స్ లో కాంట్రాక్టులు.. డబ్బులు తీసుకుని తాత్కాలిక ఉద్యోగాలు...

హైదరాబాద్ : హైదరాబాద్లోని నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్/అదనపు ప్రొఫెసర్ నోరి లక్ష్మీ భాస్కర్పై నమోదు చేసిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల సోదాల కొనసాగుతోంది.గతంలో జరిపిన సోదాలకు కొనసాగిం పుగా, లక్ష్మీ భాస్కర్ తో ఆర్థిక మరియు ఇతర లావాదేవీలు కలిగి ఉన్నారని ఆరోపించబడిన అనుమానిత బినామీల నివాసాలతో సహా, హైదరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాల్లోని (5) వేర్వేరు ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు. సోదాల సమయంలో, అనుమానిత బినామీల నివాసాల నుండి, వారి బినామీ ఆస్తులకు సంబంధించిన సాక్ష్యాధారాలలో భాగంగా ఉన్న అనేక పత్రాలు మరియు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిమ్స్ ఉద్యోగి అయిన ధనరాజ్ ఇంట్లో రూ. 4,94,394/- నగదును స్వాధీనం చేసుకోగా, నిమ్స్ ఔట్సోర్సింగ్ ఉద్యోగి అయిన డి. గణేష్ మరియు ఇతరుల పేర్ల మీద మహేశ్వరంలోని సుమారు 57 లక్షల విలువైన 3 వ్యవసాయ భూములు, బంజారాహిల్స్లోని ఎమ్మెల్యే కాలనీలో గల వెంకటేశ్వర కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రూ. 2,70,00,000/- విలువైన ఒక ఓపెన్ ప్లాట్, రూ. 20,00,000/- విలువైన రెండు పెట్టుబడులకు సంబంధించిన అనేక పత్రాలు లభించాయి. ఇంకా, రూ. 3,00,000/- చేతి అప్పు రసీదులు కూడా దొరికాయి. అదనపు ఆస్తుల తదుపరి ధృవీకరణ జరుగుతోంది. కేసు దర్యాప్తులో ఉంది.

## జిల్లా పోలీసు కార్యాలయంలో వయోవృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

వనపర్తి : అంతర్జాతీయవయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వయోవృద్ధులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐజఅ అప్‌డేట్, ఆధార్ అప్‌డేట్ తదితర పేర్లతో ఫోన్ చేసి ౧ుఖ చెప్పాలని అడగడం, వివిధ రకాల లింకులు పంపించి వాటిని ఓపెన్ చేయమని కోరడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ౧ుఖ, ఖఎజౌ, యఒ/డెబిట్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు వరకు వివిధ వయస్సుల వారు సైబర్ నేరాలకు గురైన సందర్భాలు ఉన్నందున, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు మరియు అనుమానాస్పద లింకులకు స్పందించకుండా, ముందుగా వాటి నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే అనుమానాస్పద సైబర్ నేరాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆఅఖీః ఆూఖ బాలాజీ, ఆఎూ రాకేష్ రెడ్డి, ఆఒూం కృష్ణయ్య, అఆఖూ అమృతమ్మ, ఆచిూ సూపరింటెండెంట్ అరుంధతి, ఆచిూ సుధారాణి పాల్గొన్నారు. అలాగే ౧ుఎ అంజద్ ఆలీ షీటీం సైబర్ ౧ుఎ రవి ప్రకాశ్ మరియు సైబర్ టీమ్ పాల్గొని వయోవృద్ధులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ ౧ుఖ చెప్పొద్దు, అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దు.

## సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను తొలగించడం రాజ్యాంగ విరుద్ధం

అనంతపురం : దేశవ్యాప్తంగా ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు.ఎన్నికల ప్రక్రియపై వస్తున్న అనేక ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించి.. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను తొలగించాల్సిన అవసరముందన్నారు.సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు సీఈసీ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ గుప్తా ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు చేసే జాతీయ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని సీఎం చంద్రబాబు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లకు లేఖలు రాసినట్లు రఘువీరా తెలిపారు.

# మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

రాయచోటి : మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి పల్లెలు పట్టణాలు అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజక వర్గం లోని గాలివీడు చిన్నమండెం మండలాలలో మంత్రి పర్యటించారు ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గాలివీడు పట్టణ కేంద్రం లోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న కూరగాయల మార్కెట్ సమీపంలో పంచాయతీరాజ్ నిధులతోదాదాపు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న మార్కెట్ యార్డ్ షెడ్ల పనులను రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరిశీలించారు. మార్కెట్ యార్డ్ స్థలాన్ని పరిశీలించి, వ్యాపారులు, రైతులు మరియు ప్రజలకు అన్ని విధాలా ఉపయోగకరంగా ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డ్ లో అవసరమైన తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, డ్రైనేజీ, రాకపోకలకు అనుకూలమైన వసతులు తదితర మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను మంత్రి ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారుగాలివీడు మండలం బలిజపల్లి సమీపంలో వెలసిన అసర్ల గంగమ్మ ఆలయానికి ఆర్చి నిర్మాణానికి రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆర్చి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహకాఅదేవిధంగా గోరాంచెరువు గ్రామ పరిధిలోని కుమ్మరపల్లి నుంచి గాలివీడు గ్రామంలోని బలిజపల్లి సమీపంలో ఉన్న అసర్ల గంగమ్మ ఆలయం వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ×మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిపరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిబంధనల ప్రకారం పటిష్టంగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు స్పష్టంగా సూచించారు. ప్రజలకు, ఆలయానికి వచ్చే భక్తులకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా నాణ్యమైన రహదారి నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.ప్రజల అవసరాలు, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని గాలివీడు మండలంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని ×మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు×చిన్నమండెం మండలం పడమటి కోన గ్రామంలోని బోరెడ్డిగారి పల్లెలోఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రజలు, వివిధ వర్గాల వారు తమ సమస్యలను మంత్రిగారి దృష్టికి



తీసుకువచ్చారు.ప్రజలు తెలిపిన సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు.రాయచోటి మండలం గొర్లముదివేడు గ్రామానికి చెందిన వీరారెడ్డి కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతూ రాయచోటిలోని వెంకటేశ్వర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు.ఈ సందర్భంగా చిన్నారికి ధైర్యం చెప్పి, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా వైద్యులతో మాట్లాడి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. చిన్నారి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు.గాలివీడు పట్టణంలోని పశువుల సంత ఎదురుగా ఉన్న తిరుమల మెటర్నిటీ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులు మరియు సిబ్బందికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా హాస్పిటల్ మరింత అభివృద్ధి చెందుతూ గాలివీడు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి ఆకాంక్షించారు

# వైసీపీ ఐదేళ్ల కంటే.. ఈ రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం

### పల్లె పండుగ 1.0, 2.0తో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు - 100 రెట్లు ఎక్కువగా మినీ గోకులాలు

### బ్లీచింగ్ పౌడర్ కొనలేని స్థితి నుంచి.. సొంతంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీలను తీసుకొచ్చాం

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలిసి పనులు ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



నెల్లూరు : 'పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారులు, తాగు నీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, మౌలిక వసతులతోపాటు పర్యాటక రంగానికీ ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో 'పల్లె పండుగ 3.0'కు శ్రీకారం చుట్టామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పల్లె బలపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందనే సంకల్పంతో ప్రతి పల్లెను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పల్లెపండుగ 3.0 కార్యక్రమం ద్వారా 11,085 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఈ రెండున్నరేళ్లలో పల్లెపండుగ, జలజీవన్ మిషన్ - అమరజీవి జలధార, 15వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగం, 10 వేలకుపైగా పదోన్నతులు, డి.డి.ఒ. కార్యాలయాల ఏర్పాటు.. ఇలా ఎన్నో సంస్కరణలతో ఒకవైపు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూనే, మరోవైపు వ్యవస్థను బలోపేతం చేశాం. ఒకప్పుడు పంచాయతీలు బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నుంచి, ఇప్పుడు తమ గ్రామానికి అవసరమైన పనులను తామే నిర్ణయించుకుని, తమ గ్రామ అభివృద్ధికి తామే ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీ రాజ్ వ్యవస్థను తీసుకొచ్చాం.గత ఐదేళ్ల కంటే రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణంగత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కి.మీ. సీసీ రోడ్లు నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం ద్వారా కేవలం రెండేళ్లలోనే దానికి 10 రెట్లు ఎక్కువగా, దాదాపు 9,000 కి.మీ. సీసీ రోడ్లను పూర్తి చేశాం. తంలో 304 మినీ గోకులాలు మాత్రమే నిర్మిస్తే, మనం దాదాపు 100 రెట్లు ఎక్కువగా, 30 వేలకు పైగా మినీ గోకులాలను నిర్మించాం. అలాగే, పల్లెపండుగ ద్వారా 13,326 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో భాగంగా 1 లక్ష 15 వేల పంట కుంటలను నిర్మించడంతోపాటు, 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేశాం. మరోవైపు, 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఇతర కాలనీల్లో 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే పూర్తి చేసింది. గిరిజన గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మరింత మెరుగుపరచేందుకు అడవితల్లిబాట కార్యక్రమం కింద రూ.2,180 కోట్ల వ్యయంతో సుమారు 2,437 కిలోమీటర్ల రహదారులను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇందులో ఇప్పటికే 1500 కిలోమీటర్లకు పైగా అనుసంధాన రహదారులను నిర్మించాం. అలాగే, ఇప్పటివరకు రోడ్డు అనుసంధానం లేని బంజారా, యానాది, ఎరుకుల గిరిజన ఆవాసాలు ఉన్న ప్రాంతాల్లో, పల్లెపండుగ ద్వారా 167 ఆవాసాలకు 111.4 కి.మీ. మేర రహదారి సౌకర్యం కల్పించాం. పల్లెపండుగ 3.0తో గ్రామీణ ప్రగతికి కొత్త ఊపుఈ రోజు ఇక్కడ మనం రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా, గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధిని పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లబోతున్నాం. రూ.50 వేల కోట్లతో పల్లెపండుగ, జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయబోతున్నాం. ఇందులో రూ.30 వేల కోట్లతో అక్టోబర్ 5న గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా మల్టీ విలేజ్ స్కీమ్, సింగిల్ విలేజ్ స్కీమ్ పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నాం. అలాగే రూ.9 వేల కోట్లతో పల్లెపండుగ 1.0, 2.0 కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, ఈ రోజు రూ.11,085 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగ 3.0ను ప్రారంభిస్తున్నాం. ఇందులో భాగంగా 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, మరో 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయబోతున్నాం. అలాగే, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. పైలెట్ ప్రాజెక్ట్ గా డొంక రోడ్ల అభివృద్ధి ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి నియోజకవర్గంలో ఒక డొంక రోడ్డును అభివృద్ధి చేయబోతున్నాం. ఆ తర్వాత 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్‌కు తీసుకెళ్లేలా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచబోతున్నాం. ఉదయగిరి ఇక అభివృద్ధి బాటలోశ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే దాదాపు రూ.520 కోట్లతో పల్లెపండుగ పనులు చేపట్టాం. ఇంకా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. మన ఉదయగిరిలోనే పల్లెపండుగ ద్వారా రూ.121 కోట్లతో 115 కి.మీ. మేర సీసీ, బీటీ రోడ్లు, 1,200కు పైగా నీటి కుంటలు, 348 గోకులాలు, 190కి పైగా నీటి తొట్లు, సుమారు 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశాం. ఉదయగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, గతంలో నిలిచిపోయిన సుజల స్రవంతి పథకం ద్వారా రూ.52 కోట్లతో, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 381 పనులు చేపట్టబోతున్నాం. ఉదయగిరి కోటకు చేరుకునే మార్గంలో సుమారు 4 కి.మీ. రహదారిని రూ.2.5 కోట్లతో మంజూరు చేస్తున్నాం. దీనికి అవసరమైన అటవీ శాఖ అనుమతులను త్వరగా పొందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశిస్తున్నాను. ఉదయగిరి కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి, స్వదేశీ దర్శన్, సాస్కీ పథకాల ద్వారా అవసరమైన నిధులు సమకూర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అలాగే, ఉదయగిరి కొండను హెరిటేజ్ టూరిజం ప్రాంతంగా, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉదయగిరిలో ఇప్పటికే క్రాఫ్ట్ ఉడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, వేప, బిక్కి, కల్లి, పాలబర్క వంటి చెక్కలను అందుబాటులోకి తీసుకొచ్చాం. చెక్క స్పూన్లు, గిన్నెలు, చెక్కబొమ్మల తయారీలో ప్రసిద్ధి చెందిన స్థానిక కళాకారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే, వారు తమ ఉత్పత్తులను తయారు చేసుకునేందుకు అనుగుణంగా సొసైటీ భవనాల మరమ్మతు పనులు చేపడుతున్నాం. త్వరలో శాశ్వత భవనాలను కూడా నిర్మించబోతున్నాం

## సింగరేణి కార్మికుల సమస్యపై మంత్రుల సమీక్ష

### ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్

కమాన్ పూర్ : సింగరేణి కార్మికుల సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై హైదరాబాద్ ప్రగతి భవన్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, కోల్బెల్ట్ ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ రావు, గడ్డం వినోద్, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరెం కనకయ్య, రామదాసు, సాంబశివరావు, సింగరేణి యాజమాన్యం తరఫున సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు, డైరెక్టర్లు కొప్పుల వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, తిరుమల రావు, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి.జనక్ ప్రసాద్ పాల్గొన్నారు. ఆ సమావేశంలో వచ్చిన సానుకూల స్పందన, ప్రభుత్వ హామీల వివరాలను కార్మికులకు తెలియజేస్తూ సింగరేణి ఆర్జీ-3, ఓసీ-1 గని ఆపరేషన్ సైట్ ఆఫీస్ లో ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా గడ్డం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ 2025-26 లాభాల్లో 35% లాభాల వాటాను దసరా లోపు కార్మికుల ఖాతాల్లో జమ చేయడం, కారుణ్య నియామకాలు, ప్రతి నెలా మెడికల్ బోర్డుల నిర్వహణ, సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై పన్ను మినహాయింపు, అలియాస్ నేమ్స్ సమస్యను వన్టైమ్ సెటిల్మెంట్ ద్వారా పరిష్కారం, పెండింగ్ కోర్టు/విజిలెన్స్ కేసులు, కొత్త బొగ్గు గనుల కేటాయింపు, జెన్కో/ట్రాన్స్కో బకాయిలు, 33 మంది వైద్యుల నియామకం తదితర 12 కీలక అంశాలపై దసరాలోపు నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వివరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ "సింగరేణి కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చగలిగే సత్తా, చిత్తశుద్ధి కలిగిన ఏకైక యూనియన్ ఐఎన్టీయూసీ మాత్రమే" అని తెలియజేస్తూ, కార్మికుల హక్కుల కోసం ఐఎన్టీయూసీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గని ఐఎన్టీయూసీ పిట్ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, సారయ్య, నరేష్ కుమార్, వినయ్, నతీష్, రంగా దిలీప్, చిట్టబోయిన శ్రీనివాస్, కనకయ్య, జహీర్, సమ్మయ్య, ఆనంద్, గంధం శ్రీనివాస్, నాగరాజు, రవీందర్, రాజన్న, రఘులతోపాటు ఆర్జీ-3 ఓసీ-1 కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం

హుజురాబాద్ : ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా గత కొన్ని నెలలుగా హుజురాబాద్ పట్టణంలో ధ్యాన కార్యక్రమాలను నిర్వహిస్తున్న ధ్యాన గురువు, జ్ఞాన బోధకుడు చింత అనిల్ కుమార్ సేవలను బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ అభినందించారు.హుజురాబాద్ పట్టణంలోని స్థానిక కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో తాళ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యాన కార్యక్రమానికి చందుపట్ల జనార్ధన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ధ్యానం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న చింత అనిల్ కుమార్ సేవలు అభినందనీయమన్నారు. ధ్యానం మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా దోహదపడుతుందని తెలిపారు. నేటి ఆధునిక జీవన విధానంలో ఒత్తిడి, కలుషిత వాతావరణం కారణంగా అనేక సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ధ్యానంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.ప్రజలు ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ప్రతిరోజూ కొంత సమయం ధ్యానానికి కేటాయించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకున్న సద్గురు వంటి ధ్యాన గురువులను ఆదర్శంగా తీసుకొని ధ్యానంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని కోరారు.కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ధ్యాన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, ఆకుల సదానందం, కన్నెబోయిన రాజయ్య, షీలా రాజేంద్రప్రసాద్, బజాజ్ రవీందర్ రెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ధ్యాన పరులు పాల్గొన్నారు

# కాపులకు వైసీపీ గాలం

విజయవాడ : ఏపీ రాజకీయాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ తన ఉనికిని చాటుకోవడానికి, కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి అనేక మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగానే రాబోయే రోజుల్లో కూటమిలోని కీలక భాగస్వామి అయిన జనసేనను, దాని మూలస్తంభమైన సామాజికవర్గాన్ని టార్గెట్ చేయడం ఒక వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో చోటుచేసుకున్న వంగవీటి రంగా విగ్రహ వివాదం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. నియోజకవర్గ పరిధిలోని స్థానిక సెంటిమెంట్లను రగిల్చి, దాని ద్వారా కూటమిలోని పార్టీల మధ్య ప్రత్యేకించి టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య అపోహలు సృష్టించేందుకు వైసీపీ సిద్ధం చేసిన ఒక రాజకీయ ప్రణాళిక అని జరిగిన దాన్ని బట్టి చూస్తే అర్థమైపోతుంది. ఏదైనా ప్రాంతంలో విగ్రహాల ఏర్పాటుకు స్థానిక పరిపాలనా అనుమతులు తప్పనిసరి. కానీ, స్థానిక అధికారులు మంత్రి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే లోపే, అనుమతుల కాలయాపనను నెపంగా చూపి రాత్రికి రాత్రే విగ్రహాన్ని పెట్టేయడం వెనుక స్పష్టమైన ఉద్దేశం కనిపిస్తోంది. విగ్రహం తొలగింపు పరిణామాలను తమ రాజకీయ లబ్ధికి వాడుకోవాలనేది ఇక్కడ వ్యూహం. ఈ క్రమంలోనే రాజకీయ అరంగేట్రం కోసం వేచి చూస్తున్న వంగవీటి ఆశాకిరణ్ వంటి నాయకులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని భావోద్వేగపూరితమైన వ్యాఖ్యలు చేయడం, రాజకీయాన్ని తీవ్రతరం చేయడం గమనార్హం. ప్రజా సమస్యలపై కాకుండా విగ్రహ రాజకీయాలపై ఆత్రుత చూపడం వెనుక ఉన్న స్వార్థం ప్రజలకు స్పష్టంగానే అర్థమవుతోంది. ఈ ఉదంతం వెనుక ఉన్న ప్రధాన కుట్ర కూటమిలోని జనసేన ఓటు బ్యాంకును వేరు చేయడం. టీడీపీ పాలన వల్ల రంగా విగ్రహానికి అన్యాయం జరిగిందనే ప్రచారాన్ని హోరెత్తించడం ద్వారా ఆ వర్గం యువతలో అసంతృప్తి రగల్చాలని వైసీపీ భావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందనే నిజాన్ని మరిపించి, కేవలం కుల కోణాన్ని మాత్రమే ముందుకు నెట్టడం ద్వారా జనసేనకు లభించే సామాజిక మద్దతును బలహీనపరచడమే దీని అంతిమ లక్ష్యం. కాపు సెంటిమెంట్‌ను జనసేన నుండి వేరు చేస్తే తప్ప, ఆ పార్టీ రాజకీయ బలహీనత సాధించలేమనే అంచనాతోనే వైసీపీ ఈ రకమైన వ్యూహాలకు పదును పెడుతోంది. రాజకీయంగా ఇప్పుడిప్పుడే ప్రాధాన్యత పొందుతూ, సమ్మిళిత అధికారంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక వర్గానికి లేదా పార్టీకి ఇలాంటి వివాదాలు పెద్ద అగ్నిపరీక్ష వంటివి. అధికారంలో ఉన్నప్పుడు ఏ కొద్దిపాటి తొందరపాటు లేదా అతిగా స్పందించే ధోరణి కనిపించినా, అది ఇతర వర్గాల్లో ప్రతికూల భావన పెరిగేలా చేస్తుంది.

తాము అధికారంలో ఉన్నామన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు సంయమనం కోల్పోతే, అది మిగిలిన సామాజికవర్గాలను దూరం చేసే ప్రమాదం ఉంది. ప్రత్యర్థులు పన్నిన ఈ కుల రాజకీయ వలలో చిక్కుకోకుండా ఉండాలంటే, భావోద్వేగాల కంటే పరిపక్వతతో కూడిన నిశ్శబ్ద వ్యూహం చాలా అవసరం. వైసీపీ విసిరిన ఈ విగ్రహ రాజకీయం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సింది కూటమి నాయకత్వమే. చిన్న విషయాలను సైతం పెద్ద వివాదాలుగా మార్చేందుకు ప్రతిపక్షం సిద్ధంగా ఉందనే వాస్తవాన్ని గుర్తించాలి. అధికారంలో ఉన్న పక్షాలు ముందస్తుగా చట్టబద్ధమైన పరిష్కారాలు చూపాలి తప్ప, వివాదాలు పెరిగే వరకు వేచి చూడకూడదు. కాపు ఓటు బ్యాంకుతో పాటు ఇతర వర్గాల మద్దతును సమతుల్యంగా కాపాడుకోవాలంటే, జనసేన శ్రేణులు తీవ్ర సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, ప్రత్యర్థులు ఆశించినట్లుగానే సామాజిక సమీకరణాలు దెబ్బతిని, అంతిమంగా రాజకీయంగా ఎదిగుతున్న వర్గానికే కోలుకోలేని నష్టం జరుగుతుంది. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయన్న సంగతిని ఎవరూ మర్చిపోకూడదు.

# అమరావతి ఔటర్ రింగ్ రోడ్ కు లైన్ క్లియర్

విజయవాడ : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 189.93 కిలోమీటర్ల పొడవునా 6 లేన్లతో నిర్మించనున్న ఈ ఔటర్ రింగ్ రోడ్డు పనులను 4 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి ఎన్‌హెచ్‌ఏఐ కి ప్రతిపాదనలు పంపించారు. ఈ రహదారితో పాటు నారాకోడూరు నుంచి గుంటూరు శివార్లలోని బుడంపాడు వరకు 5.2 కిలోమీటర్ల పొడవునా 4 వరుసల స్పర్ రోడ్డును కూడా అనుసంధానం చేయనున్నారు. దీంతో ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 195.13 కిలోమీటర్లకు చేరుకుంది. అమరావతి ఓఆర్ఆర్‌లో కృష్ణా నదిపై 2 వంతెనలు, 3 సొరంగాలు సహా అన్ని పనులు కలిపి 4 ప్యాకేజీలుగా విభజించారు. గతంలో ప్రతి 25 నుంచి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 6 నుంచి 8 ప్యాకేజీలుగా నిర్మించాలని మొదట భావించినప్పటికీ, పనుల పర్యవేక్షణ సులభతరం చేసేందుకు ప్యాకేజీల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మొదటి ప్యాకేజీ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వద్ద విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి ప్రారంభమై కొండపల్లి, పంగిడి అటవీ ప్రాంతాల మీదుగా మైలవరం వరకు (27వ కిలోమీటర్) సాగుతుంది. ఇందులో 2 సొరంగాలు ఉంటాయి. అలాగే చివర్లో ఉండే 189వ కిలోమీటర్ నుంచి 189.93 కిలోమీటర్ వరకు ఉన్న పనులను ఈ మొదటి ప్యాకేజీలోనే చేర్చారు. రెండో ప్యాకేజీ మైలవరం 27వ కిలోమీటర్ నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను సమీపంలోని 83వ కిలోమీటర్ వరకు మొత్తం 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. మూడో ప్యాకేజీ కోలవెన్ను 83వ కిలోమీటర్ నుంచి ప్రారంభమై గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని 133.5వ కిలోమీటర్ వరకు 50.5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ ప్యాకేజీలో అదనంగా నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు ఉండే 5.2 కిలోమీటర్ల కనెక్టింగ్ రోడ్డుతో పాటు, వల్లూరుపాలెం వద్ద కృష్ణానదిపై 4.8 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మించనున్నారు. నాలుగో ప్యాకేజీ పుల్లడిగుంట (133.5 కి.మీ) దగ్గర మొదలై ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల సమీపంలోని 189వ కిలోమీటర్ వరకు 55.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ ప్యాకేజీలో పేరేచర్ల వద్ద 400 మీటర్ల సొరంగం, మున్నలూరు వద్ద కృష్ణానదిపై 3.15 కిలోమీటర్ల మేర వంతెన ఉంటాయి. ఈ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ. 30,491 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 4 ప్యాకేజీలకు కలిపి సివిల్ పనుల నిమిత్తం రూ. 10,595.70 కోట్లు అవసరమని అంచనా వేశారు.

భూసేకరణ ప్రక్రియ కోసం రూ. 5,315 కోట్లు నిధులు కేటాయించారు. మిగిలిన నిధులను పర్యావరణ, అటవీ అనుమతుల ఖర్చులు, విద్యుత్ లైన్ల తరలింపు, మరియు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద 15 ఏళ్లపాటు వడ్డీతో కూడిన చెల్లింపుల నిమిత్తం వినియోగించనున్నారు.

# డైరక్ట్ ఎన్నికలతో ఇబ్బందులేనా?

నెల్లూరు : కూటమి ప్రభుత్వం మున్సిపల్ చట్టాలకు సవరణలు చేస్తూ మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్‌లను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించడం వైసీపీ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తోంది. పరోక్ష ఎన్నికల విధానంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపించుకుని, అనంతరం రాజకీయ సమీకరణాలతో , క్యాంప్ రాజకీయాలతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి , కనీసం గట్టి పోటీ ఇవ్వడానికి అవకాశముండేది. వార్డుల వారీగా పరిమిత శక్తిని ఉపయోగించి కొన్ని స్థానాలు గెలిచినా పార్టీ ఉనికి ఉందనే '' సంకేతాలు ఇచ్చే అవకాశం దక్కేది. అయితే, నగర లేదా పట్టణ స్థాయి మొత్తాన్ని ఒకే నియోజకవర్గంగా భావించి జరిగే ఈ ప్రత్యక్ష పోరులో విజయం సాధించాలంటే విస్తృతమైన ప్రజాదరణతో పాటు సమగ్రమైన యంత్రాంగం అవసరం. ఇది ప్రతిపక్షంలో ఉన్న వైసీపీకి అతిపెద్ద సమస్యగా మారింది. మేయర్ , ఛైర్మన్ స్థాయి ప్రత్యక్ష ఎన్నికలంటే నగరమంతటా ప్రచారం నిర్వహించడం, భారీ ఎత్తున ఆర్థిక, అంగబలాలను సమకూర్చుకోక తప్పదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీల వైపు నుంచి నగరాల్లో పోటీకి బలమైన ఆర్థిక సామర్థ్యం, సామాజిక మద్దతు ఉన్న నేతలు సులభంగానే సిద్ధమవుతున్నారు. మరోవైపు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ తరపున అంత భారీగా ఖర్చు పెట్టి, అధికార యంత్రాంగాన్ని ఎదుర్కొని పోరాడేందుకు ఆ స్థాయి హెవీవెయిట్ అభ్యర్థులు లభించడం కష్టంగా మారింది. పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా భారీగా సొంత నిధులు వెచ్చించడానికి వెనుకంజ వేస్తుండటంతో, ప్రధాన నగరాల్లో పరువు నిలబెట్టుకునే స్థాయిలో బలమైన అభ్యర్థులను ఖరారు చేయడం పార్టీ నేతలకు పెద్ద సవాలుగా మారింది. గతంలో వార్డు స్థాయి ఎన్నికల్లో స్థానిక బలగాలు, వ్యక్తిగత సంబంధాలు పనిచేసేవి. కానీ ఇప్పుడు మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికల వల్ల ఓటర్ల దృష్టి వార్డు సభ్యుల కంటే ప్రధాన పదవిపైనే ఎక్కువ కేంద్రీకృతమవుతుంది. నగరవ్యాప్తంగా అధికార పార్టీ వీచే గాలి , అభ్యర్థి ప్రాభవం ఆటోమేటిక్‌గా కింద ఉన్న వార్డు కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలపై కూడా ప్రభావం చూపుతుంది. మేయర్ అభ్యర్థికి గెలుపు అవకాశాలు లేవని భావిస్తే, అది కింది స్థాయి వార్డు అభ్యర్థుల ప్రచారంపై, అలాగే ఓటర్ల మూడ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ సమగ్ర ప్రభావం వల్లనే పలు పట్టణాల్లో వైసీపీకి చెందిన కింది స్థాయి క్యాడర్ వార్డు స్థాయి పోటీని కూడా తీవ్రంగా తీసుకోలేని నైరాశ్యంలోకి జారుకుంటోంది. ప్రత్యక్ష ఎన్నికల విధానంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికలు రావడం మంచిదేనని స్పందించారు. అయితే, పార్టీ క్షేత్రస్థాయి బలాబలాలు, నగర ప్రాంతాల్లో ఉండే ప్రతికూల వాతావరణం, అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎదురయ్యే వనరుల కొరతను లోతుగా విశ్లేషించకుండానే అధినేత ఆ ప్రకటన చేశారని పార్టీ సీనియర్ నేతలు మథనపడుతున్నారు.

నాయకులకు కేవలం ఆదేశాలు ఇవ్వడమే తప్ప, ప్రతిపక్షంలో ఉన్న ఈ క్లిష్ట సమయంలో అభ్యర్థులకు అవసరమైన ఆర్థిక లేదా క్షేత్రస్థాయి రక్షణ బాధ్యతను పార్టీ కేంద్ర నాయకత్వం ప్రత్యక్షంగా తీసుకుంటుందనే స్పష్టమైన అభయాన్ని ఇవ్వలేకపోతున్నారు. అందుకే లోకల్ పోరును సీరియస్‌గా తీసుకోకుండా నామమాత్రంగా వైసీపీ క్యాడర్ పరిగణిస్తోంది.

# సీఈసీపై చెరో దారి...

తిరుపతి : కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విషయంలో వచ్చిన ఆరోపణలు ఏపీలో ఏ రాజకీయ పార్టీకి కలసి వస్తాయన్న లెక్కలు వేసుకుటన్నాయి. భారత ఎన్నికల సంఘం లో అంతర్గత విభేదాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మరియు ఫామ్–6 మార్పులపై రేగిన జాతీయ స్థాయి వివాదం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా నివేదికల ప్రకారం.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గత 10 నెలల్లో సీఈసీ ఒంటెద్దు పోకడలపై 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారనే వార్తలతో ఏపీలోని ప్రధాన పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యూహాలు ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఎవరూ దీనిపై పెద్దగా బయటకు మాట్లాడకపోయినా వచ్చే ఎన్నికల్లో ఎన్నికల సంఘం అంత దూకుడుగా ఏపీలో వ్యవహరించదన్న లెక్కలు వేసుకుంటున్నారు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమకు దీనివల్ల కొంత మేరకు రాజకీయ ప్రయోజనం కలుగుతుందని భావిస్తుంది. సీఈసీపై తలెత్తిన ఆరోపణలతో తాము గత ఎన్నికల ఫలితాలకు కలిపి ముడిపెడుతూ బలం చేకూర్చే పనిలో వైసీపీ ఉంది. ప్రధానంగా సోషల్ మీడియలో గత ఎన్నికల్లో 40 శాతం ఓట్ల షేర్ సాధించిన తమ పార్టీకి కేవలం పదకొండు సీట్లు మాత్రమే రావడం, అర్ధరాత్రి వరకూ జరిగిన ఓటింగ్, చివరి మూడు నాలుగు గంటల్లో ఒక్కసారిగా లక్షల్లో పెరిగిన ఓటింగ్ తమ ఆరోపణలకు ప్రస్తుతం సీఈసీపై తలెత్తిన వివాదం మరింత బలం చేకూరుస్తుందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత ఎన్నికల్లో ఓట్ల అక్రమాలు జరిగాయని వైస్సార్సీపీ ఆరోపిస్తూనే ఉంది. ఇప్పుడు ఈసీలోనే అంతర్గత భేదాభిప్రాయాలు, ఓటర్ల జాబితా సవరణలపై అభ్యంతరాలు వెలుగుచూడటంతో తమ ఆరోపణలకు విశ్వసనీయత దొరికినట్లు వైస్సార్సీపీ భావిస్తోంది... అలాగే మరొకవైపు అధికార కూటమి మాత్రం తమ వాదనలను వినిపిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే వివరణ ఇస్తూ.. కమిషనర్ల మధ్య భేదాభిప్రాయాలు అంతర్గత చర్చల్లో భాగమేనని, తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది. ఏపీలోని అధికార కూటమి సైతం ఇదే లైన్ తీసుకుని, ప్రతిపక్షాలు కేవలం తమ ఓటమిని అంగీకరించలేక రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లుతున్నాయని కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. 2019 నుంచి 2024 నుంచి జగన్ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టడం, కక్ష పూరిత రాజకీయాలు చేయడం, చంద్రబాబు అరెస్ట్ వంటి వాటివల్లనే పదకొండు సీట్లు వచ్చాయని కూటమి నేతలు వాదిస్తున్నారు.

జాతీయ స్థాయిలో బీజేపీ ఈ వివాదాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రాష్ట్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మద్దతుగా నిలిచి తమ పొత్తును మరింత బలోపేతం చేసుకోవచ్చు. మొత్తం మీద కేంద్ర ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలు ఎవరికి ప్రయోజనం? ఎవరికి నష్టం? అన్న లెక్కల్లో ఎవరికి వారే ఉండటం విశేషం.

# జనసేనకు కల్ట్ పొలిటికల్ ఇమేజ్

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిన కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలోకి ప్రస్తుతం ఇతర పార్టీల, ముఖ్యంగా ప్రతిపక్ష వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి, నియోజకవర్గ స్థాయి నేతల నుంచి భారీగా చేరికలు సాగుతున్నాయి. ఓటమి భారం, భవిష్యత్తుపై అస్పష్టతతో తీవ్ర అంతర్మథనంలో ఉన్న వైసీపీ నేతలు జనసేన వైపు చూపుతుండటంతో, రాష్ట్రంలో వైసీపీకి పూర్తిస్థాయి ప్రత్యామ్నాయాన్ని జనసేన ఆక్రమించే అవకాశం ఉందా అనే అంశంపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు వరకు కూటమి కారణంగా వైసీపీ రాజకీయ పునాదులు గణనీయంగా బలహీనపడ్డాయనేది కొట్టిపారేయలేని నిజం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకోవడం సులభం కాదన్న భావనతో క్షేత్రస్థాయి శ్రేణులు, నాయకులు కొత్త రాజకీయం కోసం వెతుకులాడుతున్నారు. ఈ క్రమంలో అధికారంలో ఉండటంతో పాటు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ చూపుతున్న చొరవ, సాధిస్తున్న ఇమేజ్ చాలామందికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. కేవలం నియోజకవర్గ నేతల చేరికలే కాకుండా, పూర్తిస్థాయిలో లీడర్లను, క్యాడర్‌ను నిలకడగా పార్టీలోకి తెచ్చుకోగలిగితేనే ఈ వలసలు రాజకీయ బలంగా మారేందుకు ఆస్కారం ఉంటుంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును, స్థానిక నేతలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ రకంగానైతే క్రమంగా తన వైపు తిప్పుకొని సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారో, ఇప్పుడు పవన్ కళ్యాణ్ కూడా వైసీపీ వద్ద ఉన్న అసంతృప్తికరమైన ఓటు బ్యాంకును, ఆ పార్టీ క్యాడర్‌ను తనవైపు మళ్లించుకోవాల్సిన వ్యూహాత్మక అవసరం ఉంది. ఓటు బ్యాంకు అనేది కేవలం చేరికలతోనే మారదు. దానికి క్షేత్రస్థాయిలో నమ్మకాన్ని కల్పించే సంస్థాగత నిర్మాణం అవసరం. వైసీపీ శ్రేణులు జనసేన సిద్ధాంతాలను, పవన్ నాయకత్వాన్ని స్వీకరించి, వారంతా శాశ్వత ఓటర్లుగా మారేలా సరైన రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటేనే ప్రత్యామ్నాయ రాజకీయం రూపుదిద్దుకుంటుంది. జనసేన ప్రత్యామ్నాయంగా ఎదగడానికి ప్రధాన అడ్డంకి, సంక్లిష్టత ప్రస్తుతం ఉన్న కూటమి రాజకీయాలే. టీడీపీతో కలిసి ప్రభుత్వం నిర్వహిస్తున్న వేళ, వైసీపీకి వ్యతిరేకంగా పోరాటంలో తన స్వతంత్రతను కాపాడుకుంటూనే, పొత్తుకు విఘాతం కలగకుండా నాయకులను చేర్చుకోవడం ఒక కత్తిమీద సాము. ముఖ్యంగా కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో టీడీపీతో ఎలాంటి ఘర్షణాత్మక వాతావరణం రాకుండా, వైసీపీ ఓటు బ్యాంకునూ, లీడర్లనూ తన గూటికి చేర్చుకోవడంలో జనసేన అనుసరించే రాజకీయంపైనే పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. పవన్ కళ్యాణ్‌కు ఉన్న అపారమైన వ్యక్తిగత క్రేజ్, కల్ట్ ఇమేజ్ స్థిరమైన రాజకీయ శక్తిగా మారాలంటే నిలకడైన ప్రజాదరణతో పాటు పక్కా సంస్థాగత బలం తోడవాలి. వైసీపీ ఓటు బ్యాంకును, స్థానిక నాయకత్వాన్ని పకడ్బందీగా స్వీకరించి, రాయలసీమతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన పార్టీ క్యాడర్‌ను నిర్మించిన రోజున– పవన్ తన అసలైన కల్ట్ రాజకీయ పవర్‌ను చూపించే అవకాశం లభిస్తుంది. ఒకవేళ ఈ ఫ్లో ఇలాగే కొనసాగి, వైసీపీలోని ఖాళీని జనసేన భర్తీ చేయగలిగితే, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాలు టీడీపీ–వైసీపీ పోరు నుంచి టీడీపీ వర్సెస్ జనసేన వైపు మారినా ఆశ్చర్యపోనవసరం లేదు.

# కొలిక్కి వచ్చిన వివేకా కేసు

హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో రోజుకో కొత్త మలుపు చోటుచేసుకుంటోంది. ఈ కేసులో ఏ2గా ఉన్న కీలక నిందితుడు సునీల్ యాదవ్ సంచలన కామెంట్లతో విచారణాధికారులతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, వెనుక ఉన్న కుట్ర కోణాలను తాను ఈడీ అధికారులతో పాటు బయటి ప్రపంచానికి కూడా వెల్లడిస్తున్నారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు, లాభపడిన వ్యక్తుల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ కేసు తీవ్రతను మరో స్థాయికి తీసుకెళ్లాయి. వివేకా హత్య ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడింది మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన భార్య వైఎస్ భారతి, అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాత్రమేనని సునీల్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. అసలు సూత్రధారులను పక్కనపెట్టి తమ వంటి వారిని వేధించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, విచారణ పారదర్శకంగా జరగాలంటే జగన్ , భారతిలను కూడా సీబీఐ, ఈడీ అధికారులు తక్షణమే విచారించాలని ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం కంటే, కుట్రలో చురుగ్గా పాల్గొన్న సునీల్ యాదవ్ ఇలా తెగించి మాట్లాడటం కేసు గమనాన్ని మార్చేలా ఉంది. సునీల్ యాదవ్ చేసిన ఈ ఆరోపణలు దర్యాప్తు సంస్థల పనితీరుపై కూడా పలు అనుమానాలను, ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. హత్య జరిగిన సమయం నుంచి నేటి వరకు లభ్యమైన ఆధారాలు, సాక్ష్యాలు ఒక వైపు వేళ్లు చూపిస్తున్నప్పటికీ.. దర్యాప్తు సంస్థలకు ఈ ప్రాథమిక అనుమానాలు ఎందుకు రావడం లేదనే చర్చ నడుస్తోంది. కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక వ్యక్తుల సమీపానికి కూడా సీబీఐ అధికారులు వెళ్లేందుకు ఎందుకు సంకోచిస్తున్నారనే ప్రశ్నలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. దస్తగిరి, సునీల్ యాదవ్ కేవలం హత్యలో భాగం అయిన వారు. డబ్బుల కోసం ఆ పని చేసినవారు. కానీ అసలు సూత్రధారులు , హత్యకు కారణమైన పెద్ద తలకాయలను విచారించకుండా, కేవలం క్షేత్రస్థాయిలో ఉన్న వారిపైనే దృష్టి సారిస్తే ఈ కేసు చిక్కుముడి ఎలా వీడుతుందనేది యక్షప్రశ్నగా మారింది. గత కొన్నేళ్లుగా సాగుతున్న ఈ హైప్రొఫైల్ హత్య కేసులో దస్తగిరి తరహాలోనే మరొక కీలక నిందితుడు బయటపడి నేరుగా మాజీ సీఎం కుటుంబాన్నే నిలదీయడం రాజకీయంగా పెద్ద దుమారమే రేపుతోంది. సునీల్ యాదవ్ లేవనెత్తిన ఈ డిమాండ్లపై సీబీఐ, ఈడీ అధికారులు ఏ రకంగా స్పందిస్తారో, విచారణ ప్రక్రియను ఏ మలుపు తిప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

# మంత్రివర్గంలో నో సీనియర్స్

విజయవాడ : మరికొద్ది రోజుల్లో ఏపీ మంత్రి వర్గ విస్తరణ ఉండనుందన్న ప్రచారం ఊపందుకుంది. రెండున్నరేళ్లు ముగిసిన తర్వాత కేబినెట్ మార్పులపై టీడీపీలో ఇప్పటి నుంచి చర్చ జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గాన్ని ఇలా ఎంపిక చేయడం వెనక కూడా దూరాలోచన ఉందని అంటున్నారు. రానున్న మంత్రి వర్గ విస్తరణలో కూడా సీనియర్లకు అవకాశం ఉండదన్న వాదన వినిపిస్తుంది. మరోసారి జూనియర్లకే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు కారణాలు కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి వర్గ కూర్పులో సాంప్రదాయ రాజకీయ సమీకరణాలకు భిన్నంగా, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత వ్యూహాత్మక ఆలోచనలతో మంత్రులను ఎంపిక చేశారు. సీనియర్లను పక్కనపెట్టి మరీ ఎక్కువ మంది కొత్తవారికి చోటు కల్పించడం వెనుక ఆయనకున్న ప్రధాన ఆలోచనలు, వ్యూహాలు అనేకం ఉండొచ్చు. కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం ఇందుకు ఉదాహరణ. మంత్రివర్గంలో మొత్తం 24 మంది మంత్రులలో 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన పదిమందికి పైగా నేరుగా మంత్రి పదవులు దక్కాయి. రాబోయే కొన్ని దశాబ్దాల పాటు టు పార్టీని, రాష్ట్రాన్ని నడిపించగల సమర్థులైన ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఇప్పుడే తయారు చేయాలనేది చంద్రబాబు సుదీర్ఘ వ్యూహమని చెబుతున్నారు.. బీసీలకు పెద్దపీటమంత్రివర్గంలో వెనుకబడిన తరగతులకు 8 పదవులు, కాపులు మరియు కమ్మ సామాజిక వర్గాలకు చేరో 4 పదవులు, ఎస్సీలకు 3, ఎస్టీ మరియు మైనారిటీలకు ఒక్కో పదవి చొప్పున కేటాయించారు. ఆలోచన: టిడిపికి సాంప్రదాయకంగా అండగా ఉండే బీసీలకు ఈసారి కూడా పెద్దపీట వేయడం ద్వారా సామాజిక సమతూకాన్ని పాటించారు. అంతేకాకుండా మహిళలకు, గిరిజన ప్రాంతాలకూ ప్రాతినిధ్యం కల్పించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బుచ్చయ్య చౌదరి, కన్నా లక్ష్మీనారాయణ వంటి హేమాహేమీ సీనియర్లను మంత్రివర్గంలోకి తీసుకోలేదు. ఆలోచన: సీనియర్లను కేవలం పరిపాలనకే పరిమితం చేయకుండా, వారి అనుభవాన్ని పార్టీ సంస్థాగత బలోపేతానికి మరియు శాసనసభ వ్యవహారాల నిర్వహణకు వాడుకోవాలనేది చంద్రబాబు ఆలోచన. పర్ఫార్మెన్స్ ఆధారిత పాలనమంత్రివర్గాన్ని ఎంపిక చేసిన తర్వాత కూడా చంద్రబాబు మంత్రుల పనితీరుపై నిరంతరం సమీక్షలు జరుపుతున్నారు. మంత్రులకు అంతర్గతంగా ర్యాంకులు ఇవ్వడం ద్వారా వారిలో పోటీతత్వాన్ని పెంచుతున్నారు.

గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న వ్యవస్థలను బాగు చేయాలన్నా, కేంద్ర నిధులను రాబట్టాలన్నా మంత్రులు నిరంతరం క్రియాశీలకంగా ఉండాలనేది ఆయన ఆలోచనఅని చెబుతున్నారు. కేవలం పదవుల అనుభవం కోసం కాకుండా డెలివరీ ఆధారంగానే మంత్రుల భవిష్యత్తు ఉంటుందని బాబు స్పష్టం చేశారు. మొత్తంగా చూస్తే, చంద్రబాబు నాయుడు ఈసారి కేవలం రాజకీయ లెక్కల కోసమే కాకుండా, వేగవంతమైన అభివృద్ధి, సమర్థవంతమైన పాలన , మరియు పార్టీ భవిష్యత్తు పునాది అనే త్రివిధ వ్యూహంతోనే ఈ మంత్రుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారని, రేపు మంత్రి వర్గ విస్తరణ జరిగినా ఇలాగే ఉంటుందని అంటున్నారు.

# పాలనలో కొత్త ఒరవడి... నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

**టెక్నాలజీతో పాలనా విధానాలు మరింత సరళీకృతం - పౌరసేవల్లో నాణ్యతే సామర్థ్యాల పెరుగుదలకు గీటురాయి**

**మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ తొలి సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు**

విజయవాడ : దేశాభివృద్ధిలో వచ్చే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ కాలంలో ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పాత విధానాలు, అనవసర నిబంధనలను సరళీకరించి పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధన శృంఖల–2026 మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణ సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం ఉద్యోగులకు కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదని సీఎం అన్నారు. సవాళ్లను పరిష్కరించడంలో ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే సంస్థలుగా అవి మారాలని సూచించారు. ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆ శిక్షణ వల్ల పాలనలో ఎలాంటి మార్పు వచ్చిందో, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి మెరుగుదల కనిపించిందో కూడా కొలవాల్సిన అవసరం ఉందన్నారు. కోర్సులు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందడం మాత్రమే కెపాసిటీ బిల్డింగ్ కాదని.. నేర్చుకున్న అంశాలను ఉద్యోగులు తమ విధుల్లో ఎంతవరకు అమలు చేస్తున్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యత ఎంత మెరుగుపడుతోందన్న అంశమే ప్రామాణికత అని సీఎం స్పష్టం చేశారు.

**కెపాసిటీ బిల్డింగ్ లో ఏపీకి మొదటి స్థానం**

ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం అవార్డులు అందజేశారు. మిషన్ కర్మయోగి కింద ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7.89 లక్షల మంది ఉద్యోగులు ఐగాట్‌లో నమోదు అయ్యారని సీఎం తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా కోర్సులు పూర్తి చేసి దేశంలోని రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రెండు కోట్ల సర్టిఫికెట్ల కంటే నేర్చుకున్న అంశాలే కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందే సేవల్లో మార్పుగా ఈ అంశాలు కనిపించాలని అని సీఎం అన్నారు. శిక్షణతో ఓ రెవెన్యూ అధికారి పౌరుడి సమస్యను వేగంగా పరిష్కరించటం, ఉపాధ్యాయుడు తరగతి గదిలో మెరుగైన బోధన అందించటం.. పోలీసు అధికారి మరింత మానవీయంగా స్పందించటం ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. పూర్తి చేసుకున్న శిక్షణతో పౌరులకు నాణ్యమైన సేవలు అందుతున్న తీరుకు కొలమానంగా ఉండాలని సూచించారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES గురువారం, అక్టోబర్ 1, 2026

# ఏడాది ఎదురుచూపులకు తెర.. నానితో ఛాన్స్!



నాని తాజాగా 'ది ప్యారడైజ్' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఒక వైపు పోస్ట్ రిలీజ్ ప్రమోషన్‌లో పాల్గొంటూనే మరో వైపు తన తదుపరి సినిమా 'బ్లడీ రోమియో' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం అందుతోంది. చాలా కాలం క్రితం కలిసి వర్క్ చేయాల్సిన నాని, సుజీత్ ఫైనల్‌గా ఈ ఏడాది లో తమ కాంబో మూవీని పట్టాలెక్కించబోతున్నారు. ది ప్యారడైజ్ సినిమా కోసం కాస్త ఎక్కువ సమయం తీసుకున్న నాని తదుపరి సినిమాల విషయంలో జెట్ స్పీడ్ మెయింటెన్ చేయాలని భావిస్తున్నాడట. అందుకే సుజీత్‌కు ముందుగానే సినిమాను ఆరు నెలల లోపు పూర్తి చేయాలని చెప్పాడట. అందుకు తగ్గట్లుగా సుజీత్ ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. వచ్చే నెలలోనే షూటింగ్ ప్రారంభించి వచ్చే ఏడాది సమ్మర్ కి బ్లడీ రోమియోను విడుదల చేయబోతున్నారట. సుజీత్ తన ప్రతి సినిమాలోనూ హీరోను చాలా వైవిధ్యభరితంగా, స్టైలిష్ లుక్‌లో చూపించడం ఆనవాయితీగా వస్తుంది. ఇప్పుడు బ్లడీ రోమియోలోనూ దర్శకుడు సుజీత్ సరికొత్తగా నానిని ప్రజెంట్ చేస్తాడని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఇక నానికి జోడీగా ఈ సినిమాలో మీనాక్షి చౌదరిని ఎంపిక చేయడం దాదాపుగా కన్ఫర్మ్ అయిందని వార్తలు వస్తున్నాయి. ఇద్దరు ముగ్గురు హీరోయిన్స్ ను అనుకున్నారని, ఫైనల్‌గా మీనాక్షి చౌదరిని నానికి జోడీగా ఎంపిక చేయడం జరిగిందని యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. అయితే మీనాక్షి చౌదరి ఈ మధ్య కాలంలో పెద్దగా ఫామ్ లో లేదు అనేది కొందరి మాట. కానీ నాని సినిమాతో ఆమె తిరిగి ఫామ్‌లోకి వస్తుందని, తప్పకుండా మరోసారి ఆమె కెరీర్ స్పీడ్ అందుకుంటుంది అంటూ ఆమె సన్నిహితులు, ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిలో సంక్రాంతికి అనగనగా ఒక రాజు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా తర్వాత ఇప్పటి వరకు ఆమె నటించిన సినిమాలు విడుదల కాలేదు. ప్రస్తుతం మీనాక్షి చేతిలో నాగ చైతన్యతో కలిసి నటిస్తున్న వృషకర్మ మాత్రమే ఉంది. గత ఏడాది కాలంగా మీనాక్షి కొత్త సినిమాలకు సైన్ చేసిందే లేదు. ఫైనల్‌గా నాని సినిమాకు మీనాక్షి సైన్ చేయబోతుందని, త్వరలో చేస్తుందనే వార్తలు జోరుగా వస్తున్నాయి. మొత్తానికి వృషకర్మ సినిమా విడుదల కాకుండానే నానితో సినిమా ఛాన్స్ కొట్టేయడంతో మీనాక్షి చౌదరి కచ్చితంగా రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద సినిమాలు చేయబోతుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. 2024లో లెక్కకు మించి సినిమాలు చేసిన మీనాక్షి చౌదరి గత ఏడాదిలో కేవలం సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా తర్వాత ఏడాది గ్యాప్ తీసుకుని అనగనగా ఒక రాజు సినిమాతో వచ్చింది. నాని, మీనాక్షి చౌదరి జంటగా బ్లడీ రోమియో... మీనాక్షి చౌదరి చూడ్డానికి అందంగా ఉండటంతో పాటు, నటన విషయంలోనూ చాలా మంది హీరోయిన్స్‌తో పోల్చితే బెటర్ అనిపించుకుంది. అయినా కూడా లక్ కలిసి రాకపోవడంతో మీనాక్షికి ఆఫర్లు రావడం లేదు అనేది కొందరి మాట. ఇప్పుడు ఒక వైను నాగ చైతన్యతో మరో వైపు నానితో సినిమాలు చేస్తున్న కారణంగా వచ్చే ఏడాదిలో ఈమె జోరు కనబర్చే అవకాశాలు ఉన్నాయి. సుజీత్ సినిమా అంటే హీరోయిన్ కి మంచి గుర్తింపు ఉంటుంది. కనుక బ్లడీ రోమియోతో కచ్చితంగా ఈ అమ్మడికి గుర్తింపు దక్కడం ఖాయం, తద్వారా కెరీర్‌లో వరుసగా సినిమాలతో దూసుకు వెళ్లడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సుజీత్ దర్శకత్వంలో నాని హీరోగా నటించబోతున్న సినిమాను నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నిర్మించబోతున్నారు. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు.



## భాగ్యశ్రీ స్టైల్ అదిరింది!

టాలీవుడ్ యంగ్ బ్యూటీ అందాల భామ భాగ్యశ్రీ బోర్సే తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న గ్లామరస్ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. పచ్చని సేజ్-గ్రీన్ రంగు తలుపుల ముందు క్యాజువల్ స్టైల్‌లో నిలబడి ఆమె ఇచ్చిన ఫోజులు కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సింపుల్ వైట్ మినీ డ్రెస్‌లో ఎలాంటి హంగుబాట్లు లేకుండా ఎంతో నేచురల్ గ్లోతో కనిపిస్తున్న ఈ ముద్దుగుమ్మ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా ఫోటోషూట్ కోసం భాగ్యశ్రీ బోర్సే క్లాసీ అండ్ మినిమలిస్ట్ వైట్ హాల్టర్-నెక్ మినీ డ్రెస్‌ను ఎంచుకుంది. ముందు భాగంలో అసిమెట్రికల్ డ్రాప్ స్ట్రక్చర్, బాడీకాన్ సిలోవెట్‌తో ఉన్న ఈ డ్రెస్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తోంది. ఇక ఈ మోనోక్రోమ్ లుక్‌కు మ్యాచింగ్‌గా వైట్ పాయింటెడ్-టో హీల్స్, హై పోనీటెయిల్ జతచేసి ప్రసాద్ నాయక్ కెమెరాలో బంధించిన ఈ పిక్స్ అద్భుతంగా ఉన్నాయి. రుచి మునోత్ స్టైలింగ్, విశాల్ చరణ్ మేకప్ ఈ ఫోటోషూట్‌ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లాయి. ఈ పిక్స్ చూసిన అభిమానులు "క్యూటీ", "నైస్", "మాగ్నిఫిసెంట్", "ఏంజెల్" అంటూ కామెంట్స్ బాక్స్‌ను పొగడ్తలతో నింపేస్తూ లైకులతో ముంచెత్తుతున్నారు. ఆమె చిరునవ్వు, కాన్ఫిడెంట్ లుక్ ఈ ఫోటోషూట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. 'మిస్టర్ బచ్చన్' నుంచి పాన్-ఇండియా జర్నీ వరకు : హిందీలో 'యారియాన్ 2', 'చందు చాంపియన్' చిత్రాలతో కెరీర్ ప్రారంభించిన భాగ్యశ్రీ, రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చి 'ఉత్తమ డెబ్యూ' అవార్డును సొంతం చేసుకుంది. ఇక ఆ తర్వాత విజయ్ దేవరకొండతో 'కింగ్‌డమ్', దుల్కర్ సల్మాన్‌తో తమిళంలో 'కాంత', రామ్ పోతినేనితో 'ఆంధ్ర కింగ్ తాలుకా' సినిమాలతో అన్ని భాషల్లోనూ తన సత్తా చాటింది.

# అనుష్క ఒక్క పోస్ట్... అప్పులు పోయి భారీ లాభాలు!

ఈమధ్య కాలంలో సోషల్ మీడియాలో ప్రమోషన్‌కి భారీ డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు టీవీల్లో ఇచ్చే యాడ్స్ కోసం కంపెనీలు ఎక్కువగా ఖర్చు చేస్తున్నాయి. కానీ ఇప్పుడు అక్కడ ఖర్చు తగ్గించుకుని సోషల్ మీడియా ద్వారా ఎక్కువ ప్రచారం చేస్తున్నారు. ఏదైనా వస్తువు లేదా సేవకు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే వెంటనే రీచ్ అవుతుంది, అంతే కాకుండా ఎక్కువ మందికి వ్యాపారం చేరువ అవుతుందని అంటున్నారు. అది అక్షరాల నిజం అని చాలా వ్యాపారం వృద్ధి కనిపిస్తుంది. బాలీవుడ్ హీరోయిన్, విరాట్ కోహ్లీ భార్య అయిన అనుష్క శర్మ సోషల్ మీడియాలో నాలుగు ఏళ్ల క్రితం చేసిన ఒక పోస్ట్ ఒక వ్యాపారం రూపురేపలను మార్చేసింది. మూసి వేయాలి అనుకున్న రెస్టారెంట్ ఏకంగా కోట్ల రూపాయల లాభాలను దక్కించుకునే స్థాయికి వెళ్లింది. అనుష్క శర్మ చేసిన ఒకే ఒక్క ఇన్‌స్టా పోస్ట్ అద్భుతం సృష్టించింది. ముంబైలోని ఢిల్లీ సే అనే రెస్టారెంట్‌ను జస్పాల్ సింగ్ ఖల్సా, మహీందర్ సింగ్ ఖల్సా అనే సోదరులు 2021లో ప్రారంభించారు. ఇది ఢిల్లీ స్టైల్ చోలే భటూరే ను ముంబై వాసులకు అందించేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రారంభించిన ఏడాదిలోనే యజమానులకు దాదాపు రూ. 18 లక్షలు అప్పు అయింది. దాన్ని మెయింటెన్స్ భారంగా మారింది. ఆ సమయంలో కమెడియన్ అభిషేక్ ఉపమన్యు ఢిల్లీ సే లో చోలే భటూరే తిని బాగుంది అంటూ సోషల్ మీడియాలో రివ్యూ ఇచ్చాడు. అభిషేక్ ఉపమన్యు ఇచ్చిన రివ్యూ ను చూసిన అనుష్క శర్మ తన భర్త విరాట్ కోహ్లీ కోసం 2022, అక్టోబర్ 5న రెండు ప్లేట్ల చోలే భటూరేను ఆర్డర్ చేయడం జరిగింది. అనుష్క ఆ ఆర్డర్ అందుకుని రుచి చూసిన తర్వాత ఫిదా అయిందట. అదే విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. అనుష్క శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో ఎక్దమ్ ఢిల్లీ జైసే చోలే భటూరే లభించింది అంటూ 'ఢిల్లీ సే' రెస్టారెంట్‌ను ట్యాగ్ చేసింది. అంతే కాకుండా తనకు ఈ రెస్టారెంట్‌ను సిఫార్స్ చేసినందుకు గాను కమెడియన్ అభిషేక్ ఉపమన్యుకు కృతజ్ఞతలు అంటూ పోస్ట్ చేసింది. అనుష్క సోషల్ మీడియా ఫాలోవర్స్ మొత్తం ఢిల్లీ సే రెస్టారెంట్ గురించి తెలియడంతో ఒక్కసారిగా బిజినెస్ పెరిగింది. 2022లో అప్పులతో మూసి వేయాలి అనుకున్న రెస్టారెంట్ కేవలం అనుష్క శర్మ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో లాభాల్లో నడుస్తోంది. ముంబైలో ప్రస్తుతం ఢిల్లీ సే ఏకంగా నాలుగు ఔట్ లెట్స్ ను ఏర్పాటు చేసింది. ముందు ముందు ఈ ఔట్ లెట్స్ సంఖ్య భారీగా పెంచడం జరుగుతుందని, అంతే కాకుండా దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఈ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసి ఢిల్లీ స్టైల్ చోలే భటూరే ను రుచి చూపిస్తామని యజమానులు అంటున్నారు. ఢిల్లీ సే రెస్టారెంట్ ఇప్పుడు కోట్ల రూపాయల టర్నోవర్ చేయడం వెనుక కచ్చితంగా అనుష్క శర్మ పోస్ట్ ఉంది అనడంలో సందేహం లేదు. దాంతో చాలా మంది ఈ రెస్టారెంట్‌లో అనుష్క శర్మకు వాటా ఉందని, ఆమెను యజమానులు భాగస్వామిగా చేర్చుకున్నారు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే యజమానాలు మాత్రం ఢిల్లీ సే రెస్టారెంట్‌లో అనుష్క శర్మకు వాటా ఉందంటూ వస్తున్న వార్తలను ఎప్పటికప్పుడు కండిస్తూ వస్తున్నారు. అయితే ఆమెకు రాయల్టీ ఏమైనా ఇచ్చారా అనేది మాత్రం తెలియాల్సి ఉంది. ఆమె వల్లే నష్టాల్లో ఉన్న వ్యాపారం కోట్ల రూపాయల వ్యాపారంగా మారింది కనుక ఆమెకు రాయల్టీ ఇవ్వడంలో తప్పు లేదని, అదే సరైన పద్ధతి అంటూ చాలా మంది సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనుష్క శర్మ ఎప్పుడూ ఢిల్లీ సే రెస్టారెంట్ గురించి మాట్లాడలేదు.



# కరోనాలో బిగ్ హిట్.. ఎందుకు పట్టించుకోవడం లేదు

జాతిరత్నాలు వచ్చిన టైమ్ గుర్తు చేసుకుంటే ఫరియా అబ్దుల్లా కెరీర్ ఇంకో రేంజ్‌లో వెళ్లాలి అనిపిస్తుంది. కరోనా భయం పూర్తిగా తగ్గని రోజుల్లో వచ్చిన ఆ సినిమా థియేటర్లకు జనాలను మళ్లీ తీసుకొచ్చిన హిట్స్‌లో ఒకటిగా నిలిచింది. చిట్టి పాత్రతో ఫరియా ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ ఐదేళ్లు దాటినా ఆ హిట్ తర్వాత ఆమె కెరీర్ అదే స్పీడ్‌లో వెళ్లలేకపోవడం మాత్రం కొంచెం ఆశ్చర్యమే. ఇక్కడే ఫరియా హైట్ విషయం మళ్లీ హాట్ టాపిక్ గా మారింది. ఆమె స్వయంగా గతంలో 5 అడుగుల 10 అంగుళాల ఎత్తు తనకు మైనస్ అని కొందరు చెప్పారని, గెస్ట్ రోల్స్‌కే సరిపోతావని కామెంట్స్ కూడా వచ్చాయని చెప్పారు. మన దగ్గర మిడ్ రేంజ్ హీరోల్లో చాలామంది ఆమె కంటే పొట్టిగా కనిపించే అవకాశం ఉండటంతో కాస్టింగ్ దగ్గర మేకర్స్ వెనక్కి తగ్గుతున్నారా అనే డౌట్ చాలాకాలంగా ఉంది. అయితే హైట్ ఒక్కటే కారణమైతే జాతిరత్నాలు ఎలా పని చేసింది అన్న ప్రశ్న కూడా వస్తుంది. నవీన్ పోలిశెట్టి పక్కన ఫరియా స్క్రీన్‌పై ఎక్కడా ఇబ్బందిగా అనిపించలేదు. ఆ తర్వాత అల్లరి నరేష్‌తో చేసిన ఆ ఒక్కటి అడక్కు సినిమాలో కూడా జోడీ విషయంలో పెద్ద సమస్య రాలేదు. అంటే కెమెరా, కాస్ట్యూమ్స్, బ్లాకింగ్‌తో హైట్ తేడాను హ్యాండిల్ చేయడం ఇండస్ట్రీకి కొత్త విషయం కాదు. మరోవైపు ప్రభాస్, మహేశ్ బాబు, రానా, వరుణ్ తేజ్ లాంటి పొడవైన హీరోల పక్కన ఫరియా ఫ్రేమ్ పరంగా సులభంగా సెట్ అవుతుంది. కానీ అక్కడ సమస్య వేరే. ఆ రేంజ్ హీరోల సినిమాల్లో హీరోయిన్‌గా ఛాన్స్ రావాలంటే ఒక్క మంచి డెబ్యూ గుర్తింపు సరిపోదు. వరుసగా హిట్స్, మార్కెట్‌లో డిమాండ్, పెద్ద బ్యానర్ల ఫోకస్ కావాలి. ఫరియాకు ఇప్పటివరకు మిస్ అవుతున్నది అదే బ్రిడ్జ్. జాతిరత్నాలు తర్వాత ఆమె సినిమాలు చేస్తూనే ఉన్నారు. మత్తు వదలరా 2లో గుర్తుండే పాత్ర వచ్చింది, డాన్స్, ర్యాప్, సోషల్ మీడియాతో కూడా కనిపిస్తూనే ఉన్నారు. కానీ హీరోయిన్‌గా మరో పెద్ద కమర్షియల్ హిట్ మాత్రం పడలేదు. దాంతో ఒకవైపు హైట్ కారణంగా కొన్ని కాంబినేషన్లు కష్టమవుతుంటే, మరోవైపు టాప్ లీగ్‌కు తీసుకెళ్లే హిట్ లేకపోవడం కూడా కెరీర్‌ను మధ్యలోనే ఆపేస్తోంది. ఇప్పుడు సిగ్మా ఆమెకు అందుకే ముఖ్యమైన సినిమా. సందీప్ కిషన్‌తో కలిసి పనిచేస్తున్న ఈ సినిమాలో రేడియో జాకీగా అన్ని రకాల ఎమోషన్స్ చూపించే పాత్ర చేశానని ఫరియానే చెప్పారు. అక్టోబర్ 2న సినిమా వస్తోంది. ఇది గట్టిగా క్లిక్ అయితే హైట్ గురించే మాట్లాడే వాళ్ల కంటే, ఆమెను ఎవరితో జోడీ చేయాలి అని ఆలోచించే నిర్మాతలు పెరగొచ్చు. ఫరియాకు ఇప్పుడు కావాల్సింది మరో ఫోటోషూట్ కాదు.. కాస్టింగ్ టేబుల్ మీద ఆమె పేరును పైకి తీసుకొచ్చే ఒక పెద్ద హిట్. సిగ్మా తమిళంలో కూడా ఆమెకు మొదటి పెద్ద రిలీజ్ అవుతోంది ఇప్పుడు. అందులోనూ విజయ్ కొడుకు దర్శకుడు. కాబట్టి ఏమవుతుందో చూడాలి.



# నోటిని అదుపులో పెట్టుకోవాలి

## పార్టీ నేతలకు కొండా సురేఖ హెచ్చరిక

వరంగల్ :వర్గ విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలని, కొంతమంది నేతలు నోరు హద్దులో పెట్టుకోవాలని కొండా సురేఖ హితవు పలికారు. కొంతమంది నాయకులు హద్దు మీరి మాట్లాడుతున్నారని, నోరు అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తానని హెచ్చరించారు.

ఒక్కో మహిళ నలుగురిని కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా కొండా దంపతులను విమర్శించాలంటే నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కొండ అభిమానులను, కాంగ్రెస్ కార్యకర్తలను విమర్శించే వారు ఇకపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతిపక్ష నేతలు నాయకులు గాలిలో కత్తులు తిప్పుతున్నారని మండిపడ్డారు. వారిని ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలని సూచించారు.

# ప్రగతి పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన

ఆత్మకూరు: మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పై ఆత్మకూరులోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్ ఉత్తర్వులతో, ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్లు రాఘవకృష్ణ, శకుంతల, హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయుల సహకారంతో సుమారు 140 మంది విద్యార్థినులకు శక్తి టీం అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, ఉమెన్ హోంగార్డ్ సుప్రియ మాట్లాడుతూ అత్యవసర సమయంలో శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలి, దాని ద్వారా పొందే రక్షణ, సహాయం గురించి వివరించారు. శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర సహాయం కోసం 112, పోలీస్ సేవల కోసం 100, సైబర్ నేరాల కోసం 1930, మహిళల సహాయం కోసం 181, బాలల రక్షణ కోసం 1098 నంబర్లను వినియోగించాలని సూచించారు.అదేవిధంగా బాల్యవివాహాలు, బాలలపై నేరాలు, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా బాలికలను వేధించినా, బాల్యవివాహం జరుగుతున్నట్లు తెలిసినా భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు, ఎపికె ఫైల్స్‌ను మొబైల్‌లో ఓపెన్ చేయవద్దని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రుల ఫోన్లకు వచ్చే అనుమానాస్పద మెసేజ్‌లు, లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ గుట్కా, సిగరెట్లు, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుపై దృష్టి పెట్టి కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగవచ్చని తెలిపారు.18 సంవత్సరాల లోపువిద్యార్థులు మోటార్‌సైకిళ్లు నడపకూడదని హెచ్చరించారు.తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో బడే భాయ్ చోట భాయి రాజ్యం నడుస్తుంది

సికింద్రాబాద్: రాష్ట్రంలో బడేభాయ్ చోట భాయి రాజ్యం నడుస్తున్నదని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు..ప్రతి పక్షాలు గొంతును నొక్కుతూ ప్రజాసమస్యలను డైవర్ట్ చేస్తున్నారని ఆరోపించారు...రాజ్యాంగనికి వ్యతిరేకంగా అసెంబ్లీలో లేని 5 మంది బిఆరెస్ ఎమ్మెల్యేల ను సస్పెండ్ చేసారని తెలిపారు... ఓల్డ్ బోయినపల్లి డివిజన్ లో మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తో కలిసి బస్తి పర్యటన చేపట్టారు. 3 ఏండ్ల నుండి డివిజన్‌లో ఒక రూపాయి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే మండిపడ్డారు..కూకట్పల్లి నియోజకవర్గంలో 4 లక్షల ఓటర్లకు కేవలం లక్ష ఓట్లు మాత్రమే నమోదు అయ్యాయన్నారు... ధ్రువ పత్రాల పేరిట ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని మాధవరం మండిపడ్డారు... ఎలక్షన్ కమిషన్ అధికారులు చొరవ తీసుకొని ఓట్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు... అర్హులైన ఏ ఒక్క ఓటు పోయిన ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు..

# సొహ్రాబుద్దీన్ కేసులో 22 మంది నిర్దోషిత్వంపై సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో 22 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ కింది కోర్టులు ఇచ్చిన తీర్పును పరిశీలించేందుకు అంగీకరించింది. విచారణ సమయంలో 92 మంది ప్రాసిక్యూషన్ సాక్షులు ప్లేట్ ఫిరాయించడంపై ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, ఈ కేసులో గతంలోనే డిశ్చార్జ్ అయిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా విషయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది.సుప్రీంకోర్టు నిర్ణయాన్ని సీపీఐ సీనియర్ నేత నారాయణ స్వాగతించారు. సొహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్ బీ, సహచరుడు తులసీరామ్ ప్రజాపతి వరుస హత్యలపై సమగ్ర న్యాయ సమీక్ష జరగాలని డిమాండ్ చేశారు. ఈ కేసును విచారిస్తున్న జడ్జి బి.హెచ్. లోయా మరణంపై అప్పట్లో పెద్ద వివాదం అయిందని చెప్పారు. అప్పట్లో గుజరాత్ హోంమంత్రిగా ఉన్న అమిత్ షా ఈ కేసులో నిందితుడిగా ఉండి, ఆ తర్వాత డిశ్చార్జ్ అయిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కేసును విచారించే న్యాయమూర్తులకు ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించాలని, తద్వారా వారు ఎలాంటి భయాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా విధులను నిర్వర్తించగలరని అభిప్రాయపడ్డారు.

# గురుకుల విద్యాసంస్థలలో మహిళా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు భద్రత కరువు

రంగారెడ్డి : ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడలోని బీసీ గురుకుల క్యాంపస్‌లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు, లైంగిక వేధింపులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడి క్యాంపస్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ శ్రీలత తో మాట్లాడి క్యాంపస్‌లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు, సిబ్బంది నుంచి సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తగిన స్థాయిలో స్పందించకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని సబితా ఇంద్రారెడ్డి , మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని వారు స్పష్టం చేశారు.విద్యార్థులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు నిజమైతే, వాటిపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న డాటా ఎంట్రీ ఆపరేటర్ గా పనిచేస్తున్న వ్యక్తి ఈ రోజు బీఆర్ఎస్ బృందం వస్తుందని తెలిసి క్యాంపస్ కు రాకుండా తప్పించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, అలాగే మహిళల క్యాంపస్ లో పురుష సిబ్బందిని ఎలా నియమించారని ప్రశ్నించారు.విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై తక్షణమే స్పందించి, సంబంధిత అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని, విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలని సబితా ఇంద్రారెడ్డి , మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి

సికింద్రాబాద్ : ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు పడక నీటి కొరత ఏర్పడింది, కాబట్టి మంచినీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రజలను కోరారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి నేడు ఎమ్మెల్యే నియోజకవర్గంలోని 4వ వార్డు, పికెట్ లోని హరిజన బస్తి, శ్రీరామ్ నగర్, సంతోషిమాత టెంపుల్ బస్తీలలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నవ కంటోన్మెంట్ నిర్మాణంలో భాగంగా బస్తీ బాట పట్టినట్లు తెలిపారు. ప్రజలు లేవనెత్తిన సీవరేజ్ , విద్యుత్, మంచినీటి సరఫరా మరియు రోడ్ల నిర్మాణ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు ఇచ్చారు.

# దుమారం రేపుతున్న రేవంత్ కామెంట్స్..

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. లంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల మధ్య మత, రాజకీయ పరమైన గుర్తింపులపై ఆయన చేసిన విశ్లేషణ పెద్ద వివాదానికి దారితీసింది.రాజకీయ లబ్ధి కోసం రేవంత్ రెడ్డి సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. ఏం జరిగిందంటే..!



జాతీయ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, బీజేపీ నినాదాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలు పదే పదే 'జై శ్రీరామ్' అని ఎందుకు అంటారని, అదే తరహాలో 'హర హర మహాదేవ్' అని ఎందుకు నినదించరని ఆయన ప్రశ్నించారు.మేం ద్రావిడులం. ఇక్కడి (ఉత్తర భారతదేశం) ప్రజలు ఆర్యులు. మేం శివ భక్తులం, ఇక్కడి ప్రజలు శ్రీరాముడి భక్తులు. బీజేపీ రాముడిని దొంగిలించింది. అది ఒక భావోద్వేగం. మోదీ గారు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనరు? బీజేపీ నేతలు వేదికపై ఆ నినాదం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? వాళ్ల కేవలం 'జై శ్రీరామ్' అంటారు. మేం 'హర హర మహాదేవ్' అంటే వారికి నచ్చదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. శివుడిని 'పేదల దేవుడు' అని, రాముడిని 'ధనవంతుల దేవుడు' అని అభివర్ణించిన ఆయన, ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశ రాజకీయ సంస్కృతులు, సామాజిక గుర్తింపుల మధ్య విస్తృతమైన తేడాలు ఉన్నాయనే వాదనకు బలం చేకూర్చే క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే హిందువులను విభజించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు." రాహుల్ గాంధీ సూచనల మేరకు, హిందువులను విభజించడానికి కొత్త మార్గం కనుగొనే ప్రయత్నంలో భాగంగానే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు" అని ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీని 'ఆధునిక ముస్లిం లీగ్ కాంగ్రెస్' అని అభివర్ణించిన ఆయన, రాముడు, శివుడి అనుచరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు ఫలించవని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక మతపరమైన, ఆలయ సంబంధిత కార్యక్రమాలను వ్యతిరేకించిందని ఆయన గుర్తుచేశారు. "సోమనాథ్ ఆలయ నిర్మాణాన్ని, కాశీ విశ్వనాథ్ ధామ్ కారిడార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకించిన విషయం దేశం మరిచిపోలేదు. 2018లో 'హర హర మహాదేవ్' అని నినదించినందుకు ముగ్గురు పార్టీ కార్యకర్తలను సస్పెండ్ చేసింది" అని భండారీ ఆరోపించారు. .రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయాల కోసం దేవుళ్లను, ప్రాంతాలను వర్గాలుగా విడదీయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణలోనే రాముడు, శివుడు ఇద్దరికీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయని ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తుచేశారు. వేములవాడను దక్షిణ కాశీగా, అదే విధంగా భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా భక్తులు ఆరాధించడం నిజం కాదా అని ప్రశ్నించారు. రాముడు, శివుడి ఏకత్వానికి ప్రతీకగా నిలిచే హరిహర క్షేత్రం మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండలో ఉందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి చేసిన నార్త్-సౌత్, రాముడు-శివుడు అనే రాజకీయ విభజన అబద్ధమని నిరూపించేందుకు తెలంగాణలోని ఈ ఆధ్యాత్మిక క్షేత్రాలే సరైన సమాధానమని బండి సంజయ్ స్పష్టం చేశారు. అలాంటి ప్రాంతానికి ముఖ్యమంత్రిగా ఉండి రాముడు, శివుడిని ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు పరిమితం చేస్తూ ప్రజలను, ప్రాంతాలను ఎలా విడదీస్తారని బండి సంజయ్ ప్రశ్నించారు. సనాతన ధర్మంలో హరి, హరులకు భేదం లేదన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి మతపరమైన అంశాలను, గుర్తింపులను తెరపైకి తెస్తున్నారని బీజేపీ నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అయితే, రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాల మధ్య ఉన్న రాజకీయ వ్యూహాలు, బీజేపీ ఎన్నికల సరళి, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పై దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న ఆందోళనలను ఎత్తిచూపడమేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు వివాదం కేవలం ఆధ్యాత్మిక చర్చకే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మాటల యుద్ధానికి దారితీసింది.ఢిల్లీలో జరిగిన ఓ మీడియా కార్యక్రమంలో రేవంత్ రెడ్డి. ఉత్తరాది, దక్షిణాది రాజకీయాలను ప్రస్తావిస్తూ.. తాము ద్రావిడులమని, ఉత్తరాది వారు ఆర్యులన్నారు. దక్షిణాది వారు శివ భక్తులమని, ఉత్తరాదిన రాముడ్ని పూజిస్తారని పేర్కొన్నారు. రాముడు ధనికుల దేవుడు కాగా, శివుడు పేదల దేవుడని.. బీజేపీ మాత్రం జైశ్రీరామ్ అంటూ రాముడి పేరుతో రాజకీయాలు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'జై శ్రీరామ్' అనే బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. అయితే రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు తెలంగాణ సీఎం తీరును తప్పుపడుతున్నారు.

# అధికారంలో లేకున్నా తగ్గని జోరు.. బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

హైదరాబాద్ : తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ.15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

**టీడీపీకి అత్యధికంగా ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి విరాళం**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ)లకు అందిన విరాళాలు గత ఆర్థిక సంవత్సరంలో తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా అధికారంలోకి వచ్చినప్పటికీ టీడీపీకి విరాళాలు తగ్గగా, ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసీపీకి అందిన విరాళాల్లో భారీ పతనం నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రూ. 20 వేలకు మించి స్వీకరించిన విరాళాల వివరాలను ఆయా పార్టీలు భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నివేదించాయి.ఈ నివేదికల ప్రకారం, 2025-26లో వైసీపీకి కేవలం రూ. 24.31 కోట్ల విరాళాలు మాత్రమే అందాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఈ మొత్తం రూ. 140.04 కోట్లుగా ఉండటం గమనార్హం. అంటే, వైసీపీకి అందిన విరాళాలు సుమారు 82 శాతం మేర క్షీణించాయి. మరోవైపు, అధికార టీడీపీకి రూ. 58.25 కోట్ల విరాళాలు రాగా, అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ. 83.03 కోట్లుగా ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి అందిన విరాళాలు కూడా దాదాపు 30 శాతం మేర తగ్గుముఖం పట్టాయి

# వేర్ పాసిబిలిటీ బిగిన్స్ పుస్తక ఆవిష్కరణ

హైదరాబాద్ : పిల్లల అభ్యాసం, ఎదుగు దల, సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపైలెర్నింగ్ కర్వ్ ఫౌండేషన్ రూపొం దించినవేర్ పాసిబిలిటీ బిగిన్స్ పుస్తకన్ని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరిం చారు.సంస్థ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ అనుభవాలతో కూడిన సమాచారాన్ని ఇందులో పొందు పరిచినట్లు తెలిపారు.పిల్లల ఆత్మగౌరవం, అనుబంధ భావన, ఆత్మవిశ్వాసం మరియు వారి భవిష్యత్తు అవకాశాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించే రోజువారీ అనుభవాలను ప్రతిబింబించే సరళమైన, హృదయాన్ని హత్తుకునే కథలు ఇందులో ఉంటాయని చెప్పారు.

# అధికార పార్టీలకు మైలేజీ ఇస్తుందా?

హైదరాబాద్ : ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు




స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎమ్, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో 300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతా పరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనే యోచనలో నాయకత్వం ఉంది. ఖైరతాబాద్‌ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్‌గా మారబోతోంది. ఒకవేళ ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ , కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తే, ఆ పొలిటికల్ వేవ్‌ను వాడుకుని తక్షణమే గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అప్పటివరకు న్యాయస్థానాల్లో ఉన్న లీగల్ అడ్డంకులనుక్లియర్ చేసి, వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది.రాబోయే 3 నుంచి 4 నెలల్లో ఖైరతాబాద్ ఉపఎన్నికతో పాటు గ్రేటర్ సమరంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాక తప్పదు.

# సరికొత్త రికార్డు క్రియేట్ చేస్తున్న రియల్ ఎస్టేట్

హైదరాబాద్ : ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఏడవ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్‌కు హైదరాబాద్ నగరం ఆతిథ్యమిచ్చి సరికొత్త రికార్డు సృష్టించింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అంతర్జాతీయ సదస్సు భారతదేశంలో జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. 2026 సెప్టెంబర్ 25 నుండి 27 వరకు మూడు రోజుల పాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ గ్లోబల్ ఈవెంట్‌కు అమెరికా, యూకే, యూఏఈ, సింగపూర్ సహా ప్రపంచ వ్యాప్తంగా 35కు పైగా దేశాల నుంచి 1500 మందికి పైగా అంతర్జాతీయ ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలు, డెవలపర్లు , గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు హాజరయ్యారు.ది డోర్ టు వాట్ హ్యాపెన్స్ నెక్స్ట్ అనే ప్రధాన థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో రియల్ ఎస్టేట్ రంగంలో రాబోయే ఊహించని మార్పులు, ప్రపంచ ఆర్థిక ప్రాధాన్యతలు , అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహంపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఆధునిక సాంకేతికతలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , ప్రాప్‌టెక్ , డీప్‌టెక్, సుస్థిర పర్యావరణ అభివృద్ధి వంటి కీలక అంశాలపై అంతర్జాతీయ నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు.

ఈ సదస్సు కేవలం చర్చలకే పరిమితం కాకుండా.. అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్, ప్రాప్‌టెక్ అండ్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో అనే మూడు ప్రధాన విభాగాలు ఒకే వేదికపై కొలువుదీరి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చారిత్రాత్మక వేదికపై నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్-ఇండియా ఛైర్మన్ సుమంత్ రెడ్డి ప్రస్తుతం భారతదేశానికి చెందిన డెవలపర్లు, రియల్టీ నిపుణులు ,మౌలిక వసతుల ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని రీతిలో రూపుదిద్దుకుంటున్నాయని అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఐఆర్ఈసీ సదస్సు భారతీయ రియల్ ఎస్టేట్ సత్వర పురోగతిని, మన దేశ నిర్మాణ రంగ సామర్థ్యాన్ని ప్రపంచ వేదికపై సగర్వంగా చాటిచెప్పేందుకు ఒక ఉత్తమ వేదికగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు.అలాగే ఎఫ్ఐఏబీసీఐ 2026 ఛైర్ శైలేందర్ సింగ్ ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన సరికొత్త ఆవిష్కరణలు, అంతర్జాతీయ పెట్టుబడులతో భారతదేశాన్ని అనుసంధానించే అత్యుత్తమ గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం అని స్పష్టం చేశారు.

# కళ్యాణిని షఫీనే చంపాడు..

హైదరాబాద్ : ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో సంచలనం సృష్టించిన కళ్యాణి అలియాస్ దుర్గ (29) దారుణ హత్య కేసు మిస్టరీని పోలీసులు చేధించారు. భవానీపురానికి చెందిన షఫి అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు కళ్యాణితో నిందితుడు షఫికి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలోనే కొన్నాళ్ల క్రితం కళ్యాణి తన కుమారుడిని షఫికి అప్పగించింది. అయితే, తన కుమారుడిని తిరిగి ఇచ్చేయాలని ప్రియుడిపై కళ్యాణి పదే పదే ఒత్తిడి తెచ్చింది.ఈ కుమారుడి విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన షఫి, 10 రోజుల కిందట కళ్యాణిని దారుణంగా హత్య చేశాడని పోలీసులు తెలిపారు.

హత్య చేసిన అనంతరం ఆధారాలు లభించకుండా ఉండేందుకు మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి సమీపంలోని కెనాల్‌లో పడేశాడు. లభ్యమైన శరీర భాగాలకు సంబంధించిన ఫోటోలను పోలీసులు ఇన్‌స్టా సహా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మృతురాలి చేతిపై ఉన్న ప్రత్యేకమైన టాటూ ఆధారంగా ఆమె సోదరుడు డెడ్ బాడీ కళ్యాణిదని గుర్తించారు. స్థానిక మీడియా సహకారంతోనే ఈ కేసును వేగంగా చేధించామని ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు.

అసలేం జరిగింది.. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం చిన తడినాడకు చెందిన కళ్యాణికి చిన్నప్పుడే తల్లి మరణించింది. తండ్రి తడినాలోనే చిన్న చిన్న పనులు చేస్తుండేవాడు. కళ్యాణికి సోదరుడు ఉన్నాడు. గన్నవరం సమీపంలోని ఓ అనాథాశ్రమంలో తండ్రి వీరిని చేర్చగా అక్కడే పెరిగారు. ఇద్దరు మేజర్లు అయిన అనాథాశ్రమం నుంచి బయటకు వచ్చారు. మంగళగిరిలో ఓ వ్యక్తిని వివాహం చేసుకుని అక్కడే స్థిరపడింది.భర్తతో విభేదాల కారణంగా వేరుగా ఉంటూ మంగళగిరిలోని ఒక హోటల్‌లో సప్లయర్‌గా పనిచేస్తోంది.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B-258, Phase-1, Vanasthalipuram, Hyderabad-70. Printed at **Garuda Printers**, H.No :2-86/1, Plot No. 23 -SP, Sy.No.417, Sagar High Way. Ragannaguda Village, Abdullapurmet (M), Rangareddy Dist, Telangana State- 501510 , **Published at :** H.No.Plot no.1, Bhagya laxmi Towers, opp: GHMC, L.B.Nagar Circle, venkateswara Colony, Saroornagar, Ranga Reddy Dist. Hyderabad-500035,Telangana State, **Editor :B. Pramod Kumar**, **RNI No: TELTEL/2021/81803**